SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131

సంపుటి : 18 సంచిక : 252 ఎడిటర్ : విక్రం కుమార్ బుధవారం 21, మే 2025 ప్రచురణ : హైదరాబాద్ పేజీలు: 8 వెల: రూ.5

## దుర్బలులపై శ్రద్ధ చూపితేనే..
# ప్రపంచ ఆరోగ్యం సాధ్యం

- జెనీవా సదస్సును ఉద్దేశించి మోదీ వీడియో సందేశం

**మే 20, సమయం న్యూస్:** దిల్లీ: ప్రపంచ ఆరోగ్యం అత్యంత దుర్బలులపై మనం చూపే శ్రద్ధపైన ఆధారపడి ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఆరోగ్యకరమైన భావి ప్రపంచం కలుపుకొనిపోవడం, సమగ్ర దృష్టి, సహకారంతోనే సాధ్యమని చెప్పారు. నేడు అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సవాళ్లకు భారతదేశ విధానాలు





# విచారణకు రండి...

- కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ పిలుపు
- జూన్ 5న రావాలంటూ నోటీసు పంపిన జస్టిస్ పీసీ ఘోష్
- 6న హరీశ్‌రావు, 9న ఈటల రాజేందర్ హాజరుకావాలంటూ సమాచారం
- మాజీ సీఎంతో భేటీ అయిన హరీశ్

**మే 20, సమయం న్యూస్: హైదరాబాద్:** విచారణకు రావాలంటూ తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నోటీసు జారీ చేసింది. జూన్ 5న కమిషన్‌కు రావాలని కోరింది. కేసీఆర్‌తోపాటు అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావును అదే నెల 6న, ఆ సమయంలో ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న ఈటల రాజేందర్‌ను 9న హాజరు కావాలని సమాచారం ఇచ్చింది. ఈ మేరకు 'కాళేశ్వరం'పై న్యాయ విచారణ చేస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ మంగళవారం నోటీసులు పంపారు. జూన్ 5న బూర్గుల రామకృష్ణారావు భవనంలోని ఎనిమిదో అంతస్తులో ఉన్న కాళేశ్వరం కమిషన్ కార్యాలయానికి కేసీఆర్ వెళ్లాల్సి ఉంటుంది.

**అఫిడవిట్లు, క్రాస్ ఎగ్జామినేషన్లలో అంశాల ఆధారంగానే...**

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ 2023 అక్టోబరులో కుంగడం,

తరువాయి 2లో

## భక్తులకు తక్కువ ధరకే
# నాణ్యమైన ఆహారం

- డ్రోన్ల నియంత్రణ.. స్విమ్స్‌కు అదనంగా రూ.71 కోట్లు
- తితిదే ధర్మకర్తల మండలి సమావేశంలో కీలక నిర్ణయాలు

**మే 20, సమయం న్యూస్, తిరుపతి:** తిరుమల తిరుపతి దేవస్థానానికి ఎక్కువ ఆదాయమిచ్చే వ్యక్తులు, సంస్థలకు గతంలో బిగ్ క్యాంటీన్లు, జనతా క్యాంటీన్ల కాంట్రాక్టు అప్పగించారు. వారు భక్తుల నుంచి అధిక ధరలు వసూలుచేసి నాణ్యత లేని ఆహారం అందిస్తున్నారని తితిదే ఈవో శ్యామలరావు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో యాత్రికులకు తక్కువ ధరకే మంచి ఆహారం లభించేలా చర్యలు చేపట్టనున్నామని వివరించారు. ప్రస్తుతం ఆయా సంస్థలు నిర్వహిస్తున్న హోటళ్లకు ఓ బృందం వెళ్లి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశాకే అనుమతుల ప్రక్రియ

తరువాయి 2లో



# ఉగ్రజాడలా.. ఊడలా?



- నగరంలో నిఘా వర్గాల జల్లెడ
- వరుస ఘటనలతో పోలీసు యంత్రాంగం అప్రమత్తం

**మే 20, సమయం న్యూస్, హైదరాబాద్:** హైదరాబాద్: నగరంలో మరోసారి ఉగ్రజాడలు కలకలం రేపుతున్నాయి. రెండ్రోజుల కిందట సికింద్రాబాద్ బోయగూడలో సమీర్ అనే యువకుడిని విజయనగరం పోలీసులు అదుపులోకి తీసుకోవడం ఉలికిపాటుకు గురిచేసింది. పాకిస్థాన్ నిఘా వర్గాలకు మనదేశ రక్షణ సమాచారాన్ని చేరవేసిందనే ఆరోపణలు ఎదుర్కొంటున్న యూ ట్యూబర్ జ్యోతిమల్హోత్రా సైతం

తరువాయి 2లో

## ధరల పర్యవేక్షణకు
# మంత్రుల కమిటీ...

- అవసరమైతే నల్ల బర్లీ పొగాకును ప్రభుత్వమే కొంటుంది
- గిట్టుబాటులేక విలవిల్లాడుతున్న రైతులను ఆదుకుంటాం
- ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ
- మద్యం కుంభకోణంపై మంత్రులెవరూ బయట మాట్లాడవద్దని ఆదేశం
- దోషులెవర్నీ వదిలిపెట్టబోమని స్పష్టీకరణ

2లో



## ఏపీలో నేడు పలు జిల్లాలకు
# అతి భారీ వర్ష సూచన

**మే 20, సమయం న్యూస్,** విశాఖపట్నం: 'నైరుతి' రుతుపవనాలు ఈ నెల 23 లేదా 24 నాటికి కేరళలోకి ప్రవేశించడానికి పరిస్థితులు అత్యంత అనుకూలంగా మారుతున్నాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) మంగళవారం వెల్లడించింది. ఈ నెల 26 నాటికి రాయలసీమ మీదుగా రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.

**2009 తర్వాత ఇప్పుడే**

గత ఏడాది రుతుపవనాలు సాధారణం (జూన్ 1) కంటే రెండు రోజులు ముందుగా మే 30న కేరళను తాకాయి. అదేరోజు తమిళనాడులోని కొన్ని ప్రాంతాలు, బంగాళాఖాతం మీదుగా ఈశాన్య రాష్ట్రాలకూ విస్తరించాయి. కేరళ తీరం, ఈశాన్య ప్రాంతాలను ఒకేసారి

తరువాయి 2లో





## సైనిక దుస్తుల్లో
# ఉగ్రవాదులు

- కశ్మీర్‌లో స్థానికులకు కొత్త చిక్కులు

**మే 20, సమయం న్యూస్:** పహల్గాం ఉగ్రదాడితో వణికిపోయిన జమ్మూకశ్మీర్ ప్రజలను ఇప్పుడు మరో సమస్య వెంటాడుతోంది. ఉగ్రవాదులు సైనిక దుస్తులు ధరించి సంచరిస్తుండటంతో స్థానికులకు కొత్త సమస్య ఎదురవుతోంది. భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య తేడాను గుర్తించలేక అయోమయానికి గురవుతున్నారు. అటు భద్రతా సిబ్బందికి ఉన్న ముప్పును పసిగట్టడంలోనూ ఇబ్బంది ఎదురవుతోంది. పహల్గాం దాడి నాటి నుంచి ఈ తరహా ఘటనలు పెరగడం ఆందోళనకరంగా మారింది. ఏప్రిల్ 22న పహల్గాంలో పర్యాటకులపై

తరువాయి 2లో

# ఉగ్రసంస్థల 'లాంతర్' తంత్రం

- విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులతో యువతను ఆకర్షించేందుకు కుట్ర
- సికింద్రాబాద్, విజయనగరం నిందితుల విచారణలో వెలుగులోకి

**మే 20, సమయం న్యూస్ : హైదరాబాద్:** ఉగ్రసంస్థలు సామాజిక మాధ్యమాల ద్వారా యువతలో విద్వేషాలు రెచ్చగొట్టి దేశంలో తమ కార్యకలాపాలకు వినియోగించుకుంటున్నాయి. సున్నిత మనస్కులను తమ భావజాలానికి ఆకర్షితులయ్యేలా చేసి ఉగ్రచర్యలకు పాల్పడేలా ప్రేరేపిస్తున్నాయి. ఇందు కోసం 'మ్యాజిక్ లాంతర్' అనే కొత్త పంథాను అనుసరిస్తున్నట్లు ఇటీవల పట్టుబడిన యువకుల విచారణలో దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఓ వర్గానికి సంబంధించిన అంశాలపై పోస్టులు పెడుతూ వాటికి స్పందించే వారిని గుర్తించి తమ వలలో వేసుకుంటున్నారని తేల్చాయి. ఈ మ్యాజిక్ లాంతర్ ప్రక్రియ ఎలా సాగుతుందంటే. మొదట ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్.. తదితర యాప్‌లలో ఉగ్ర సంస్థల హ్యాండ్లర్లు.. దేశంలో ఒక



వర్గానికి అన్యాయం జరుగుతోందని, దాన్ని ఎదుర్కోవాలని పోస్టులు పెడతారు. వీటికి అనుకూలంగా

తరువాయి 2లో

# 'పొగ' బట్టిన మృత్యువు

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మేడిగడ్డతోపాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో న్యాయ విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేయడం తెలిసిందే. 2024 మార్చిలో ఏర్పాటైన ఈ కమిషన్ కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణంలో పాలుపంచుకొన్న వివిధ విభాగాల ఇంజినీర్లు, నిర్మాణ సంస్థలు, ఆర్థిక, నీటిపారుదల శాఖల ఉన్నతాధికారులు, పే అండ్ అకౌంట్స్ అధికారులను విచారించింది. కొందరు స్వచ్ఛందంగానూ కమిషన్ ఎదుట హాజరయ్యారు. అందరి నుంచి అఫిడవిట్లను తీసుకొని, క్రాస్ ఎగ్జామిన్ చేశారు. వాటిలో వచ్చిన అంశాల ఆధారంగా ప్రస్తుతం కేసీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లను పిలిచినట్లు స్పష్టమవుతోంది. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో తీసుకొన్న నిర్ణయాల ప్రకారమే తాము ముందుకెళ్లినట్లు పలువురు విచారణలో పేర్కొన్నారు. ఇంజినీర్లు చెప్పిన, ఇచ్చిన రికార్డులను నిర్ధారించుకోవడానికి, వివిధ అంశాలపై కేసీఆర్ అభిప్రాయాలను తెలుసుకోవడానికి హాజరు కావాలని కోరినట్లు సంబంధితవర్గాలు తెలిపాయి. కమిషన్ విచారణ దాదాపు పూర్తయిన దశలో కేసీఆర్‌ను పిలవడం ప్రాధాన్యాన్ని సంతరించుకొంది. కాళేశ్వరం నిర్మాణ సమయంలో హరీశ్‌రావు నీటిపారుదలకు, ఈటల రాజేందర్ ఆర్థిక శాఖకు మంత్రులుగా ఉన్నారు. ప్రాజెక్టుకు రుణం తీసుకొనేందుకు ఏర్పాటు చేసిన కార్పొరేషన్, మేడిగడ్డ బ్యారేజీలో అదనపు పనుల అప్పగింత తదితర అంశాలపై వీరి నుంచి వివరాలను కోరే అవకాశముంది. అధిక సంఖ్యలో ఇంజినీర్లను, అధికారులను, నిర్మాణ సంస్థలను విచారించాల్సి రావడంతో కమిషన్ గడువును రాష్ట్ర ప్రభుత్వం ఏడుసార్లు పొడిగించింది. ఈ నెలాఖరుతో కమిషన్ గడువు ముగియనుండటంతో కేసీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లను పిలవకుండానే తుది నివేదిక ఇస్తారనే ప్రచారం జరిగింది. అయితే విచారణలో ఇంజినీర్లు చెప్పిన, రాతపూర్వకంగా ఇచ్చిన అఫిడవిట్ల ఆధారంగా వీరితో మాట్లాడకుండా తుది నివేదిక ఇవ్వరాదని కమిషన్ భావించడంతో మరో రెండు నెలలు సమయం ఇచ్చి జులై ఆఖరు వరకు గడువు పెంచుతూ సోమవారం సర్కారు ఆదేశాలు జారీ చేసింది. సోమవారమే ముగ్గురికీ నోటీసులు ఇవ్వాలని కీలక నిర్ణయం తీసుకొన్న కమిషన్, మంగళవారం పంపినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

**కేసీఆర్‌తో హరీశ్‌రావు భేటీ**

ఎర్రవల్లిలోని నివాసంలో భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మంగళవారం మాజీ మంత్రి హరీశ్‌రావు కలిశారు. కాళేశ్వరం కమిషన్ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో... వారి భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. కమిషన్ నోటీసులపై కేసీఆర్‌తో హరీశ్‌రావు చర్చించినట్లుగా తెలిసింది. కమిషన్ ఎదుట హాజరవడానికి ఇంకా సమయం ఉండడంతో... ఈ అంశంపై మరోసారి చర్చిద్దామని కేసీఆర్ సూచించినట్లు సమాచారం. కమిషన్ ఎదుట హాజరుకు కేసీఆర్‌కు, హరీశ్‌రావుకు తేదీలను వేర్వేరుగా ఖరారు చేయడంతో అందుకు తగ్గట్టుగానే కమిషన్ ఎదుట వాంగ్మూలం ఇచ్చేందుకు త్వరలో మరోసారి సమావేశం కావాలని నిర్ణయించినట్లు తెలిసింది.

## దుర్బలులపై శ్రద్ధ చూపితేనే.. ప్రపంచ ఆరోగ్యం సాధ్యం

(మొదటిపేజీ తరువాయి)

స్థిరమైన ప్రత్యామ్నాయ నమూనాలు చూపగలవన్నారు. జెనీవాలో జరుగుతున్న 78వ 'ప్రపంచ ఆరోగ్యసభ' సదస్సును ఉద్దేశించి మంగళవారం వీడియో సందేశం ద్వారా ప్రధాని మాట్లాడారు. ఈ ఏడాది ఇతివృత్తమైన 'ఆరోగ్యం కోసం ఒకటే ప్రపంచం' గురించి చెబుతూ ఇది ప్రపంచం పట్ల భారతదేశ దార్శనికతకు అనుగుణంగా ఉందన్నారు. భారతదేశ ఆరోగ్య సంస్కరణల్లో కలుపుకొనిపోవడం ప్రధానమైనదిగా పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్యబీమా పథకం 'ఆయుష్మాన్ భారత్' 58 కోట్లమందికి ఉచిత చికిత్సలు అందుతున్నట్లు తెలిపారు. 70 ఏళ్లు దాటిన భారతీయులు అందరికీ వర్తించేలా ఇటీవలే దీన్ని విస్తరించామన్నారు. భారత్‌లో వేలాది ఆరోగ్య, వెల్‌నెస్ కేంద్రాల విస్తృత నెట్‌వర్క్ ఉందని.. క్యాన్సర్, మధుమేహం, అధిక రక్తపోటు వంటి రుగ్మతలను ముందస్తు పరీక్షల ద్వారా గుర్తించడానికి ఇవి దోహదపడుతున్నట్లు వెల్లడించారు. అలాగే వేలాది ప్రభుత్వ ఫార్మసీలు తక్కువ ధరకు నాణ్యమైన మందులు అందిస్తున్నట్లుగా నొక్కి చెప్పారు. ఆరోగ్య వసతులను మెరుగుపరచడంలో సాంకేతికత పాత్ర గురించి చెబుతూ గర్భిణులు, పిల్లలకు టీకాలు వేయడంలో ఉపయోగపడుతున్న ప్రత్యేక డిజిటల్ ఆరోగ్య గుర్తింపు వ్యవస్థను వివరించారు. టెలీ మెడిసిన్ అనేది ఇపుడు వైద్యులకు అందరినీ చేరువ చేసిందన్నారు. భారత ఉచిత టెలీ మెడిసిన్ సేవల ద్వారా 34 కోట్ల సంప్రదింపులు జరిగినట్లుగా తెలిపారు. జూన్ నెలలో రాబోతున్న 11వ 'అంతర్జాతీయ యోగా దినోత్సవం'ను గుర్తుచేస్తూ ఈ ఏడాది 'ఒకే భూమి, ఒకే ఆరోగ్యసమాజం కోసం యోగా' పేరుతో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ప్రపంచ దేశాలన్నీ పాల్గొనాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

## ఉగ్రజాడలా.. ఊడలా?

(మొదటిపేజీ తరువాయి)

వందేభారత్ ప్రారంభోత్సవ సమయంలో నగరానికి వచ్చిందని, ఆ సమయంలో ఇక్కడ కొంతమందిని కలిసిందనే ప్రచారం జరుగుతుండటంతో పోలీసులు ఆవైపుగా విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల జరిగిన పహల్గాం దాడి, తాజాగా జరిగిన ఘటనల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు.

**అక్రమ వలసదారులపై కన్ను**

అక్రమంగా నివాసం ఉంటున్న 100 మంది బంగ్లాదేశీయులను 4 నెలల వ్యవధిలో పట్టుకున్నారు. నకిలీ ఆధార్, ఓటరు గుర్తింపు కార్డులతో నగర పౌరులుగా చెలామణి అవుతున్నట్టు గుర్తించిన కొందరిని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. వారికి సహకరించిన వ్యక్తుల వివరాలు రాబడుతున్నట్టు సమాచారం. అక్రమంగా ఉన్న విదేశీయులను గుర్తించి పంపివేయాలంటూ తాజాగా సుప్రీం కోర్టు ఆదేశాలిచ్చింది. కేంద్ర నిఘా వర్గాలు కూడా ఉగ్ర కార్యకలాపాలపై హెచ్చరికలు జారీచేసిన నేపథ్యంలో రాజధాని పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. ఖైరతాబాద్, సనత్‌నగర్, జవహర్‌నగర్, అంబర్‌పేట్ ప్రాంతాల్లో 15 మంది విదేశీయులను గుర్తించినట్టు సమాచారం.

**మారుపేర్లతో చెలామణి**

బంగ్లాదేశ్ నుంచి కొందరు అక్రమంగా పశ్చిమబెంగాల్ మీదుగా నగరానికి చేరినట్టు పోలీసులు గుర్తించారు. ఇప్పటికీ చాలామందిని అదుపులోకి తీసుకున్నా ఇంకొందరు జనావాసాల మధ్య ఉంటున్నట్టు భావిస్తున్నారు. వీరంతా కోల్‌కతాలో దళారుల నుంచి అక్కడి ఆధార్, ఓటరు గుర్తింపు కార్డులు పొందారు. నగరం వచ్చాక వాటి వివరాలతో ఆధార్ చిరునామా మార్చుకుంటున్నారు. రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో 5200 మంది రోహింగ్యాలు నివాసం ఉంటున్నట్టు నిర్ధారించారు.

## సైనిక దుస్తుల్లో ఉగ్రవాదులు

(మొదటిపేజీ తరువాయి)

ఉగ్రవాదులు పాశవిక దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఆ రోజు కాల్పులు జరిపిన దుండగులు సైనిక దుస్తుల్లో వచ్చారని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. దీంతో ఆ దిశగా భద్రతా బలగాలు దర్యాప్తు చేపట్టాయి. ఆ తర్వాత కూడా ఉగ్రవాదులు అదే పంథా కొనసాగిస్తున్నట్లు భద్రతా సిబ్బంది గుర్తించారు. ఇటీవల జమ్మూకశ్మీర్‌లో జరిగిన పలు ఎన్‌కౌంటర్లలో ఉగ్రవాదులు సైనిక దుస్తుల్లో కనిపించినట్లు సమాచారం.

**ముష్కరులను పాక్ అప్పగించాల్సిందే..**

టెల్ అవీవ్: ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రపంచ దేశాలు ఏకం కావాలని ఇజ్రాయెల్‌లోని భారత రాయబారి జేపీ సింగ్ పిలుపునిచ్చారు. పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా భారత్ విజయవంతంగా ''ఆపరేషన్ సిందూర్'' నిర్వహించిన సంగతి తెలిసిందే. దీనిపై భారత రాయబారి మాట్లాడుతూ.. అమెరికా తరహాలోనే పాకిస్థాన్ కూడా ఉగ్రవాదులను అప్పగించాలన్నారు. ఒక ఇజ్రాయెలీ వార్తా సంస్థతో మాట్లాడుతూ.. ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'భారత్ పాక్‌కు నీటిని అందిస్తే.. వారు మా దేశంపై ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్నారు. రక్తం, నీరు కలిసి ప్రవహించలేవని భారత ప్రధాని మోదీ ఇప్పటికే స్పష్టం చేశారు. అందుకే సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేశాం' అని సింగ్ పేర్కొన్నారు.

# పాక్ సైనిక ప్రధానాధికారికి పదోన్నతి

* **ఫీల్డ్ మార్షల్‌గా అసీమ్ మునీర్**



ఇస్లామాబాద్: పాకిస్థాన్ ప్రభుత్వం తన సైనిక బలగాల ప్రధానాధికారి అసీమ్ మునీర్‌కు ఫీల్డ్ మార్షల్‌గా పదోన్నతి కల్పించాలని మంగళవారం నిర్ణయించింది. దీంతో మునీర్ పాకిస్థాన్ చరిత్రలో ఆ స్థాయి పొందిన రెండో వ్యక్తి అయ్యారు. భారత్‌తో ఇటీవల జరిగిన సైనిక సంఘర్షణలో కీలక పాత్ర పోషించిన కారణంగా ఆయనకు పదోన్నతి కల్పించినట్టు పాక్ ప్రభుత్వం ప్రకటించింది. ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారని అధికారిక ప్రకటన తెలియజేసింది. ధైర్యంతో కూడుకున్న నాయకత్వాన్ని, అత్యున్నత వ్యూహాలను ప్రదర్శించడం ద్వారా శత్రువును ఓడించి దేశ భద్రతకు పాటుపడినందుకు జనరల్ అసీమ్ మునీర్‌కు ఫీల్డ్ మార్షల్ స్థాయి కల్పించాలని పాకిస్థాన్ ప్రభుత్వం నిర్ణయించింది'' అని ఆ ప్రకటన తెలియజేసింది.

# ధరల పర్యవేక్షణకు మంత్రుల కమిటీ

అమరావతి: పంటలకు ధరల్లేక ఇబ్బంది పడుతున్న రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. వ్యవసాయ దిగుబడులు, గిట్టుబాటు ధరలు, నిత్యావసరాల ధరలపై ఆరుగురు మంత్రులతో మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమిస్తున్నట్టు ప్రకటించారు. నల్ల బర్లీ పొగాకును వీలైనంత వరకు వ్యాపారులతో ప్రభుత్వం కొనిపిస్తుందని, అవసరమైతే ప్రభుత్వమే కొంటుందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం మంత్రివర్గ సమావేశంలో వ్యవసాయరంగ సమస్యలు, అన్నదాతల కష్టాలు, పంటల మార్కెటింగ్‌లో ఇబ్బందులపై సుమారు 45 నిమిషాలు చర్చించారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి పంటల దిగుబడులు పెరిగాయని అధికారులు వివరించారు. అంతర్జాతీయ పరిణామాలు, దేశవిదేశాల్లో పరిస్థితులు పంటల ధరలపై ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో మిర్చి, పొగాకు, కోకో, చెరకు, మామిడితో పాటు, ఆక్వా ఉత్పత్తుల ధరలు తగ్గడానికి కారణాల్ని వివరించారు. ధరల విషయంలో రైతులకు ఇబ్బంది తలెత్తకుండా చూస్తామని, వారికి సాంత్వన చేకూరేలా, క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించేలా ప్రభుత్వచర్యలు ఉంటాయని ముఖ్యమంత్రి ప్రకటించారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు చేపట్టాల్సిన చర్యలపై మంత్రివర్గ ఉపసంఘం నిరంతరం పర్యవేక్షిస్తుందన్నారు. మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు లాంటి ఎన్నికల హామీలపై, కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలను ప్రకాశం జిల్లాలోకి తీసుకురావడం లాంటి ఎన్నికల హామీల సాధ్యాసాధ్యాలపై త్వరలో నివేదిక ఇవ్వాలని సీఎం ఆదేశించారు. రెవెన్యూ అంశాలపై మంత్రివర్గ ఉపసంఘంలో జనసేన, భాజపాల నుంచి మంత్రుల్ని సభ్యులుగా నియమించి... ఆ కమిటీకి ఈ బాధ్యత అప్పగించాలన్నారు.

**మంత్రులెవరూ మాట్లాడొద్దు**

వైకాపా హయాంలో జరిగిన మద్యం కుంభకోణంపై సిట్ దర్యాప్తు జరుగుతున్నందున మంత్రులెవరూ దీనిపై బయట మాట్లాడవద్దని, మీడియా ప్రతినిధులు అడిగినా స్పందించవద్దని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ''మద్యం కుంభకోణంపై దర్యాప్తు సంస్థలు నిష్పాక్షికంగా, స్వతంత్రంగా, ఒక పద్ధతి ప్రకారం దర్యాప్తు చేస్తున్నాయి. తప్పు చేసినవాళ్లు ఎంతటివారైనా వదిలే ప్రసక్తి లేదు. దర్యాప్తు జరుగుతున్నప్పుడు మంత్రులు స్పందిస్తే... దర్యాప్తును ప్రభావితం చేస్తున్నారన్న భావన కలిగే అవకాశం ఉంది. మద్యం కుంభకోణంపై కేంద్ర దర్యాప్తు సంస్థలూ దృష్టిపెట్టాయి. తప్పు చేసినవారు తప్పించుకోరాదన్న విధానంలోనే కేంద్ర, రాష్ట్రాల్లో కూటమి పాలన సాగుతోంది'' అని చంద్రబాబు పేర్కొన్నారు.

**శ్రీశైలాన్ని అభివృద్ధి చేద్దాం**

రాష్ట్రంలో ఎక్కువ సంఖ్యలో భక్తులు సందర్శించే, అత్యధిక ఆదాయం వచ్చే దేవాలయాల్లో శ్రీశైలం రెండో స్థానంలో ఉందని, భక్తులకు మరింత మెరుగైన సదుపాయాలు కల్పిస్తూ ఆ క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశించారు. అక్కడ భూముల సమస్యల్ని అటవీ, రెవెన్యూశాఖలు, అవసరమైతే కేంద్రంతో సమన్వయం చేసుకుని పరిష్కరించాలని తెలిపారు. శ్రీశైలం హైదరాబాద్ రహదారిపై తరచూ ట్రాఫిక్‌జామ్‌తో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో జంతుప్రదర్శన శాలలు ఏర్పాటుచేసే అంశాన్నీ పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.

**ప్రతి జిల్లాలో ఒక యూనివర్సిటీ**

రాష్ట్రంలో ప్రతి జిల్లాలో కచ్చితంగా ఒక యూనివర్సిటీ అయినా ఉండాలని సీఎం తెలిపారు. ప్రస్తుతం ఏడు జిల్లాల్లో యూనివర్సిటీలు లేవన్నారు. దీనిపై చర్చ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ... నూజివీడులో స్థలం ఉందని, అక్కడ యూనివర్సిటీ ఏర్పాటుచేయాలని ప్రతిపాదించారు. జిల్లా కేంద్రాల్లో ఉంటేనే అందరికీ అనుకూలమని, తమ ప్రాంతాల్లోనే యూనివర్సిటీలు రావాలని ప్రజా ప్రతినిధులు ఆలోచించడం సరికాదని సీఎం పేర్కొన్నారు.

**వంటగ్యాస్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఎంతమంది టీ తాగారు?**

రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను మంత్రులు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఎంతమంది మంత్రులు క్షేత్ర పర్యటనల్లో భాగంగా ఉచిత వంటగ్యాస్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి.. టీ అడిగి తాగారని ఆయన ప్రశ్నించారు. మంత్రులెవరూ వెళ్లలేదని తెలుసుకుని ఆయన కొంత అసంతృప్తి వ్యక్తంచేశారు.

## భక్తులకు తక్కువ ధరకే నాణ్యమైన ఆహారం

(మొదటిపేజీ తరువాయి)

ఉంటుందన్నారు. తిరుమల అన్నమయ్య భవనంలో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన మంగళవారం ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. ఈవో శ్యామలరావు నిర్ణయాలు వెల్లడించారు. తిరుచానూరు శ్రీపద్మావతి, నారాయణవనం ఆలయం, కపిలతీర్థం, నాగాలాపురం దేవస్థానం, ఒంటిమిట్ట రామాలయం, అమరావతి శ్రీవారి ఆలయాల సమగ్రాభివృద్ధికి నిర్ణయం. ఒంటిమిట్టలో అన్నదానం సేవలు మెరుగు. తుళ్లూరు మండలం అనంతవరం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి రూ.10 కోట్లు. ఆకాశగంగ, పాపవినాశనం ప్రాంతాల అభివృద్ధి. ఇజ్రాయెల్ సాంకేతికతతో యాంటీడ్రోన్ వ్యవస్థ. స్విమ్స్‌లో అంతర్జాతీయ సేవల కోసం విశ్రాంత ఐఏఎస్ ఐవీ సుబ్బారావు నేతృత్వంలో కమిటీ సిఫార్సుల మేరకు 597 పోస్టులు మంజూరు, న్యూరాలజీ, నెఫ్రాలజీ విభాగాల్లో వైద్యుల సంఖ్య రెట్టింపు. డీడీ నెక్స్ట్ చిత్రబృందానికి కాపీరైట్ అతిక్రమణ నోటీసులు జారీ. తిరుమలలోని పచ్చదనాన్ని 80 శాతానికి పెంచేందుకు నాలుగేళ్లలో అటవీ శాఖకు రూ.4 కోట్ల కేటాయింపు. ఉద్యోగులకు పదోన్నతులు, గోశాలలో ఆవుల రక్షణ, శ్రీవారి మెట్టుమార్గంలో రవాణాకు శాశ్వత పరిష్కారం, వీఆర్‌ఎస్ తీసుకునే అన్యమత ఉద్యోగులకు అదనంగా రూ.5 లక్షల చెల్లింపు.

## ఉగ్రసంస్థల 'లాంతర్' తంత్రం

(మొదటిపేజీ తరువాయి)

స్పందించే యువత సామాజిక మాధ్యమ ఖాతాలపై నిఘా పెడతారు. ఓ వర్గానికి సంబంధించిన పోస్టులపై వారి స్పందనలను ఆరా చేస్తారు. సాధారణంగా స్పందించే వారిని కాకుండా.. ఆవేశపూరితంగా మాట్లాడే వారిని ఎంపిక చేసి తమ జాబితాలో చేర్చుకుంటారు. తరువాత నుంచి వారి ఖాతాలకు నేరుగా పోస్టులు పెడతారు. ఆ వర్గంపై అన్యాయం జరుగుతోందంటూ తీవ్రమైన సందేశాలు పంపి వారిలో విద్వేషం రగిలిస్తారు. తమ ఉగ్ర కార్యకలాపాలకు సహకరిస్తారనే నమ్మకం కుదిరితే తమ సంస్థ సానుభూతిపరులతో పరిచయం చేయించి తరచూ సమావేశాలకు పిలుస్తారు. అక్కడ ఉగ్రసంస్థ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనాలని ప్రోత్సహిస్తారు.

**ఇదే విధంగా 'అహిం' కుట్రదారుల ఎంపిక**

తాజాగా పోలీసులు అరెస్టు చేసిన సికింద్రాబాద్, ఏపీలోని విజయనగరం ప్రాంతాలకు చెందిన యువకులను ఉగ్ర సంస్థ హ్యాండ్లర్ మ్యాజిక్ లాంతర్ ద్వారానే ఎంపిక చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. అనంతరం వీరితోనే 'అల్ హింద్ ఇత్తేహాదుల్ ముసల్మీన్(అహిం)' అనే సంస్థను స్థాపించేలా చేసినట్లు గుర్తించారు. వీరి హ్యాండ్లర్ బాంబు తయారీకి సంబంధించి అంశాల గురించి ఓ పీడీఎఫ్ ఫైల్‌ను సిగ్నల్ యాప్ ద్వారా వీరికి పంపినట్లు అనుమానిస్తున్నారు. దాని ఆధారంగా తయారు చేసిన బాంబును తొలుత ప్రయోగాత్మకంగా పరిశీలించాలని ఆదేశించినట్లు తేలింది. అది విజయవంతమైతే తర్వాత జనసమ్మర్ద ప్రాంతాల్లో పేల్చాలని హ్యాండ్లర్ సూచించేవాడని వెల్లడైంది. అయితే ఈ ఉపద్రవాన్ని ముందుగానే పసిగట్టిన దర్యాప్తు సంస్థలు యువకులను అరెస్టు చేయడంతో భారీ ఉగ్రకుట్ర భగ్నమైంది. అలాగే దేశంలో సంచలనం సృష్టిస్తున్న ఐఎస్ఐ ఏజెంట్ జ్యోతి మల్హోత్రాను సైతం ఉగ్రసంస్థలు సామాజిక మాధ్యమాల ద్వారానే ట్రాప్ చేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మ్యాజిక్ లాంతరు ప్రక్రియను ఉగ్రసంస్థలు విస్తృతంగా వినియోగిస్తున్న నేపథ్యంలో దర్యాప్తు సంస్థలు అప్రమత్తమయ్యాయి.

## గాజాపై విరుచుకుపడుతున్న ఇజ్రాయెల్

* **తాజా దాడుల్లో 85 మంది మృతి**



డెయిర్ అల్ బలా: అంతర్జాతీయంగా వస్తున్న ఆక్షేపణలను బేఖాతరు చేస్తూ గాజాపై ఇజ్రాయెల్ నిరాటంకంగా దాడులు కొనసాగిస్తూనే ఉంది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకూ జరిపిన వైమానిక దాడుల్లో దాదాపు 85 మంది పాలస్తీనీయులు ప్రాణాలు కోల్పోయారు. హమాస్ చెరలో బందీలుగా ఉన్న ఇజ్రాయెలీలను విడిపించేందుకే తాము ఈ దాడులకు పాల్పడుతున్నామని ఇజ్రాయెల్ స్పష్టం చేసింది. ఇజ్రాయెల్ చేపట్టిన తాజా దాడుల్లో ఇప్పటివరకూ 300 మందికి పైగా పాలస్తీనా పౌరులు మరణించారు. ఓ వైపు దాడులకు పాల్పడుతూనే మరోవైపు పరిమితంగా పాలస్తీనీయులకు ఆహారం, వైద్యం, ఇంధనం వంటి నిత్యావసరాలను అందించడానికి ఇజ్రాయెల్ అనుమతినివ్వడం గమనార్హం.

## పాక్ ప్రధాని షెహబాజ్‌కు ఆ గ్రామమంటే మమకారం

పహల్గాం ఉగ్రదాడితో భారత్‌పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు తీవ్రతరమయ్యాయి. ఇరు దేశాల మధ్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్న వేళ పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు సంబంధించిన ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. పాకిస్థాన్‌లోని అత్యంత ధనిక కుటుంబాల్లో ఒకటైన షరీఫ్ కుటుంబం మూలాలు కశ్మీర్‌లోని అనంత్‌నాగ్‌లో ఉన్నాయి. వీరి పూర్వీకులు కశ్మీరీ పండితులని ''పాకిస్థాన్ ఎ హార్డ్ కంట్రీ'' అనే పుస్తకంలో బ్రిటిష్ రచయిత లైవెన్ అనటోల్ పేర్కొన్నారు. ఈ కుటుంబం కశ్మీర్ నుంచి అమృత్‌సర్‌కు సమీపాన ఉన్న ''జాతి ఉమ్రా'' గ్రామానికి బ్రిటిష్‌హయాంలోనే తరలి వెళ్లింది. షరీఫ్ కుటుంబానికి ఈ గ్రామం అంటే ఎంతో ఇష్టమని స్థానికులు అంటున్నారు. అందుకే ఈ ఉద్రిక్తతలు తమను బాధిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతి ఉమ్రా గ్రామంలో షరీఫ్ పూర్వీకులకు ఒక ''హవేలీ'' (భవంతి) ఉండేది. అది ఇప్పుడు ఒక గురుద్వారాగా మారిందని, అందులో ఉచితంగా భోజనం అందించే ఒక లంగర్ హాల్ కూడా నిర్మిస్తున్నట్లు స్థానికుడు హర్దీప్ సింగ్ తెలిపారు. ''1976లో షెహబాజ్ షరీఫ్ సోదరుడు అబ్బాస్ షరీఫ్ తమ హవేలీని మా గ్రామానికి విరాళంగా ఇచ్చారు.

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుక.. మన పత్రిక తెలుగు దినపత్రిక



## జూన్ 1 నుంచి వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ పోటీలు



క్రీడా ప్రతినిధి, మే 20 : జూన్ 1వ తారీకు నుంచి వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా బ్యాట్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కోసరాజు లక్ష్మణ్, జనరల్ సెక్రెటరీ బి ఏ వి డి ఉప్పలపాటి వి.ఎన్. బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు సబ్ జూనియర్, జూనియర్, మెన్, ఉమెన్, మాస్టర్ విభాగాలుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలు కొండాపూర్ లోని ఏ జోన్ బ్యాట్మెంటన్ అకాడమీ లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీలు వికారాబాద్ జిల్లాకు సంబంధించిన బ్యాట్మింటన్ క్రీడాకారులకు మాత్రమేనని సూచించారు. ఇతర జిల్లా క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనడానికి అనర్హులన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు రిజిస్ట్రేషన్ మరియు జూన్ 1వ తేదీ స్పాట్ ఎంట్రీస్ చేసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం బ్యాట్ వెబ్ సైట్లు సంప్రదించాలన్నారు. ఈ పోటీలు కొండాపూర్ లోని ఏ జోన్ బ్యాట్మింటన్ అకాడమీలో నిర్వహిస్తున్నట్లు వారు చెప్పారు. ఇతర వివరాల కోసం మొబైల్ నెంబర్లు 76748 97777 లేదా 90000 05678 ను సంప్రదించాలని కోరారు.

# ఇందిరమ్మ ఇండ్లు గృహనిర్మాణ పథకం బోధన్‌లో వేగవంతం

* **సబ్ కలెక్టర్, కమిషనర్ పరిశీలన**

బోధన్ పట్టణం, మే 20, సమయం న్యూస్ : బోధన్ మున్సిపల్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు గృహ నిర్మాణ కార్యక్రమం అమలును మరింత పారదర్శకంగా, వేగంగా తీసుకు రావడానికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో మరియు మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ కలిసి 14వ మరియు 15వ వార్డులను సందర్శించారు. ఈ పర్యటనలో, పథకం కింద మంజూరు చేయబడిన ఇళ్లకు మార్కింగ్ ప్రక్రియను అధికారులు సమీక్షించారు. లబ్ధిదారులతో ప్రత్యక్షంగా మాట్లాడిన సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ప్రతి ఇంటికి ₹5 లక్షల నిధులను దశలవారీగా విడుదల





చేసే విధానాన్ని వివరించారు. ప్రతి దశలో అవసరమైన డాక్యుమెంటేషన్, అధికారిక ఆమోదాలు మరియు నిధుల విడుదలకు సంబంధించిన కాలక్రమం గురించి లబ్ధిదారులకు పూర్తి అవగాహన కలిగించారు.

**ఈ పర్యటన ప్రధాన లక్ష్యాలు:**

* గృహనిర్మాణ పథకంలో పారదర్శకతను నెలకొల్పడం
* లబ్ధిదారుల సందేహాలను తొలగించడం
* ఇళ్ల మంజూరు మరియు మార్కింగ్ ప్రక్రియను వేగవంతం చేయడం

ఇందిరమ్మ ఇండ్లు పథకం బోధన్ మున్సిపల్ పరిధిలో విజయవంతంగా అమలవుతోంది. అధికారులు నియమిత కాలపట్టికలో ఇంటి నిర్మాణాలు పూర్తి చేయడానికి కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అధికారులతో పాటు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పాషా మోహినుద్దీన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శరత్ రెడ్డి, అంకు దాము తదితర ప్రముఖులు విడిసి సభ్యులు శ్రీనివాస్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## బోధన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదుగురికి జైలు శిక్ష

బోధన్. 20 మే. సమయం న్యూస్ : బోధన్ పట్టణంలోని రాత్రి సమయంలో నిర్దేశించిన సమయానికి మించి హోటల్ మరియు షాపులు తెరిచి ఉంచి నడపడంతో సదరు యజమానులకు సోమవారం రోజున సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శేషతల్ప సాయి గారి ముందు హాజరుపరచగా ఇద్దరు దాబ యజమానులకు మరియు ఇద్దరు ఫాస్ట్ ఫుడ్ యజమానులకు రాత్రిపూట తెరిచి ఉంచినందుకు గాను నలుగురికి ఒక రోజు జైలు శిక్ష విధించడం జరిగింది. మరియు తాగి వాహనం నడపిన ఒక వ్యక్తి కీ ఒక రోజు జైలు శిక్ష విధించడం జరిగింది అనీ బోధన్ ఎస్ ఛ్ ఓ వెంకటనారాయణ తెలిపారు *ఉన్నతాధికారుల ఆదేశానుసారం నిర్దిష్ట సమయం తర్వాత హోటల్లు, దాబాలు కానీ ఏవైనా వాణిజ్య సంస్థల సముదాయాలు మూసివేయాలని లేనిచో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని తెలిపారు. మరియు మద్యం సేవించి వాహనాలు నడప రాదని బోధన్ SHO వెంకట్ నారాయణ తెలిపారు.

# సాలూరా మండలంలో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

* **సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఆకస్మిక పర్యటన***

బోధన్ నియోజకవర్గం, సాలూరా మండలం, మే 20, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గం సాలూర మండలంలో ఇందిరమ్మ ఇళ్ల స్థలం గృహనిర్మాణ పథకం అమలు వేగవంతమవుతోంది. మే 20 మంగళవారం సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఆకస్మికంగా సాలూర మండలాన్ని సందర్శించి, భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో నిర్మించబోయే ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద గృహాలకు సంప్రదాయ పద్ధతిలో భూమిపూజ చేసి ముగ్గులు పోశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, "ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా ఆర్థికంగా బలహీన వర్గాల ప్రజలకు





సొంత గృహం కలగడం వల్ల వారి జీవన ప్రమాణం మెరుగవుతుంది. ఇది గ్రామీణ ప్రాంతాల్లో మానవ వాసతలకు గౌరవం కలిగించే చర్య" అని తెలిపారు. అధికారులను ఉద్దేశించి ఆయన, భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, ఎలాంటి సాంకేతిక సమస్యలు లేకుండా లబ్ధిదారులకు ఇళ్లు అందజేయాలంటూ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ పర్యటన ద్వారా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పారదర్శకత, సమర్థవంతమైన అమలు మరియు లబ్ధిదారులకు నేరుగా మద్దతు అందించేందుకు బలమైన పునాది పడిందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ కార్యక్రమంలో సాలూరా మండల తాసిల్దార్ శశిభూషణ్, ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ తదితర ప్రభుత్వ అధికారులు, గ్రామ సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్, అల్లె రమేష్, రాహుల్, లక్ష్మణ్, కేజీ గంగారం, ఆర్టీసీ భూమన్న, నాగిరెడ్డి సాయిరెడ్డి, తదితర గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.




## ప్రారంభానికి సిద్ధమైన సివిల్ జడ్జి కోర్ట్

జిన్నారం, మే 20, సమయం న్యూస్ : మండల కేంద్రమైన జిన్నారంలో నూతన న్యాయస్థానం సిద్ధమైంది. మండలానికి మంజూరైన జూనియర్ సివిల్ జడ్జి కం జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేటివ్ కోర్ట్ తాత్కాలిక భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. త్వరలోనే కోర్టు సేవలు అందించేందుకు సిద్ధంగా ఉంది. మండల కేంద్రమైన జిన్నారంకు మంజూరైన కోర్టులో జిన్నారం ,గుమ్మడిదల, హత్నూర మండల పరిధిలో గల 4 పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు ఇక్కడ విచారణ జరగనున్నాయి. గతంలో జిన్నారం మండలం నర్సాపూర్ కోర్టు పరిధిలో ఉండగా, జిల్లాల విభజనతో మండలం సంగారెడ్డి కోర్టు పరదిలోకి చేరింది. మండల వాసులు సంగారెడ్డి కోర్టుకు పోయి రావడానికి నానా అవస్థలు పడ్డారు. కొత్త కోర్టులకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో జిన్నారంలోనె కోర్టు సేవలు ప్రారంభం కానున్నాయి. మండల మహిళా సంఘ భవనాన్ని తాత్కాలిక కోర్టు భవనంగా ఎంపిక చేశారు. ఆర్అండ్బి మంజూరు చేసిన 8.4 లక్షల రూపాయలతో కిటికీలు, తలుపులు, కేసులు విచారణ హాలు, పెయింటింగ్, తదితర పనులు పూర్తి చేశారు. త్వరలో ప్రారంభం కానున్న కోర్టుతో మూడు మండలాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

# భూ భారతి అర్జీలపై పక్కాగా క్షేత్రస్థాయి విచారణ

* **కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**



నిజామాబాద్, మే 20( సమయం న్యూస్) : భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూ భారతి చట్టం కింద దాఖలైన దరఖాస్తులను నిశితంగా పరిశీలన జరుపుతూ, పక్కాగా క్షేత్రస్థాయి విచారణ చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు రెవెన్యూ బృందాలకు సూచించారు. పైలెట్ ప్రాజెక్టు కింద మెండోరా మండలంలోని అన్ని గ్రామాలలో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతులు, ప్రజల నుండి భూ సంబంధిత అంశాలపై అర్జీలు స్వీకరించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో వచ్చిన అర్జీలపై రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కూడిన బృందాలు క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న విచారణ ప్రక్రియ తీరును కలెక్టర్ మంగళవారం స్వయంగా పరిశీలించారు. మెండోరా మండలంలోని బుస్సాపూర్, దూదిగాంలను సందర్శించి, ఫీల్డ్ ఎంక్వయిరీ జరుపుతున్న విధానాన్ని నిశిత పరిశీలన జరిపారు. క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్న క్రమంలో దరఖాస్తుదారులు స్థానికంగా ఉన్నారా, లేదా అన్నది గమనించారు. అర్జీదారులతో భేటీ అయ్యి వారు ఏ అంశాలపై దరఖాస్తులు చేసుకున్నారు అనే వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. రెవెన్యూ బృందాలు క్షేత్ర విచారణ సందర్భంగా పరిశీలిస్తున్న అంశాల గురించి వారిని అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలిస్తూ, భూ భారతి చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా ఫీల్డ్ వెరిఫికేషన్ చేయాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మెండోరా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న డెస్క్ వర్క్ ప్రక్రియను కలెక్టర్ తనిఖీ చేశారు. డెస్క్ వర్క్ ద్వారా రెవెన్యూ రికార్డులతో దరఖాస్తులోని వివరాలను సమగ్రంగా పరిశీలన చేసుకోవాలని, అనంతరం క్షేత్రస్థాయికి వెళ్లి నిబంధనలకు అనుగుణంగా విచారణ జరపాలన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టినందున ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా డెస్క్ వర్క్, ఫీల్డ్ వెరిఫికేషన్ లను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్, తహసీల్దార్లు శ్రీకాంత్, మల్లయ్య, కిరణ్మయి, సంతోష్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



## కార్మికులకు నష్టం జరిగే 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలి

- **-సిఐటియు నాయకులు**

గుమ్మడిదల , మే 20,సమయం న్యూస్ : గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి పారిశ్రామికవాడలో కేంద్ర కార్మిక సంఘాలు నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెకు సంఘీభావంగా మంగళవారం సిఐటియు నాయకులు కార్మికులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు మాట్లాడుతూ కార్మికులకు నష్టం కలిగించే 4 లేబర్ కోడ్లను తక్షణం రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనాన్ని చెల్లించాలని నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత చర్యలచర్చా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ మే 20(సమయం న్యూస్) : రోడ్డు భద్రత ప్రమాదాల నివారణపై ఢిల్లీలో ఏర్పాటుచేసిన దేశంలోని జిల్లా కలెక్టర్లకు, ఇంజనీరింగ్ అధికారులకు జరిగిన చర్చ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మంగళవారం ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత పైన ఎంపిక చేయబడిన దేశంలోని వందమంది జిల్లా కలెక్టర్లకు, ఇంజనీరింగ్ అధికారులతో సుదీర్ఘంగా చర్చ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి తీసుకున్న చర్యలను వివరిస్తూ నేషనల్ హైవే పై ఇంకా తీసుకోవలసిన భద్రతాచార్యులపై సూచించడం జరిగింది. రోడ్డు ప్రమాదాల నివారణపై జిల్లా కలెక్టర్, ఎస్పి ఆధ్వర్యంలో సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో చర్చించిన అంశాలను పరిగణలోకి తీసుకొని ఇంజనీరింగ్ అధికారులు పాటించే విధంగా రాష్ట్ర మరియు జాతీయస్థాయిలో మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేస్తే పెద్ద ఎత్తున ప్రమాదాలు నివారించవచ్చు అని సూచించడం జరిగింది.





## ఈ నెల 31లోగా జల్ శక్తి అభియాన్ పోర్టల్ లో వివరాలను నమోదు చేయాలి

* **జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

జనగాం మే20(సమయం న్యూస్) : మంగళవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ జల్ శక్తి అభియాన్ పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. అటవీ, వ్యవసాయ, ఉద్యాన, ఆర్‌డబ్ల్యూఎస్, భూగర్భ జల శాఖ, తదితర సంబంధిత శాఖల సమన్వయంతో జల సంరక్షణ, వర్షపు నీటి పెంపుదలకు ఊట చెరువులు, కందకాలు, చెక్ డ్యామ్ పనుల్లో భాగంగా చిన్న, సన్నకారు రైతుల పొలంలో పంట కుంటలు, ఊట కుంటల తవ్వకం, నదీ పరీవాహక ప్రాంతాల్లో చెక్ డ్యాం నిర్మాణం, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్, సాంప్రదాయ నీటి వనరులు, చెరువుల పునరుద్ధరణలో చెరువుల పూడిక తీయడం, కాలువల పూడిక తీయడం, బోర్ వెల్స్, రింగ్ ట్రెంచ్ లు, రిచార్జ్ పిట్ ల నిర్మాణ పనులపై పూర్తి వివరాలను ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వకుండా జల్ శక్తి అభియాన్ పోర్టల్ లో సరైన విధంగా నమోదు చేయాలని సూచించారు. అలాగే ఆయా పనుల చిత్రాలను కూడా స్పష్టంగా ఈ నెల 31లోగా నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జెడ్పీ సీఈవో మాధురి షా, డిప్యూటీ జెడ్పీ సీఈవో సరిత, డీఆర్డీఓ వసంత, డీపీఓ రామారావు నాయక్, డీఈఓ భోజన్న, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఇతర సంబంధిత అధికారులు, ఏడీఏలు, తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ పునరావాసం పై సమీక్ష

* **జిల్లా ప్రత్యేక అధికారి జి రవి నాయక్...**



మహబూబ్ నగర్ మే20(సమయం న్యూస్) : జిల్లాలో నిర్మాణంలో ఉన్న సాగు నీటి ప్రాజెక్ట్ లు,ఎత్తి పోతల పథకాల భూ సేకరణ,పునరావాస పనులు వేగవంతం చేయాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి (special officer) జి.రవి నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం(కలెక్టరేట్) లోని వి.సి. హాల్ లో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తో కలిసి పాల మూరు రంగా రెడ్డి ఎత్తిపోతల పథకం లో భాగంగా నిర్మిస్తున్న ఉదండ పూర్ రిజర్వాయర్ నిర్మాణం భూ సేకరణ,ఆర్&ఆర్ పనులను,కోయిల్ సాగర్,మహాత్మా గాంధీ ఎత్తి పోతల పథకాల భూ సేకరణ పై ఇరిగేషన్,రెవెన్యూ,విద్యుత్,మిషన్ భగీరథ,సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖల అధికారులతో సమీక్షించారు. ఉదండ పూర్ రిజర్వాయర్ నిర్మాణం లో భాగంగా జడ్చర్ల మండలం లోని వల్లూర్,ఉదండ పూర్,తుమ్మలకుంట తండా, రేగడి పట్టి తండా,చిన్న గుట్ట తండా,ఒంటి గుడిసె తండా, శామగడ్డ తండా లు ముంపుకు గురవుతున్నట్లు అధికారులు వివరించారు. జడ్చర్ల మండలం లోని ఖానాపూర్,ఉదండ పూర్,వల్లూరు,పోలేపల్లి, కిష్టారం రెవెన్యూ గ్రామాలు,నవాబ్ పేట మండలం లోని తీగల పల్లి,కార్ కొండ, సిద్ధోటం రెవెన్యూ గ్రామాల్లో 4887.035 ఎకరాల వ్యవసాయ భూముల భూ సేకరణకు గాను 4876.185 ఎకరాలు భూ సేకరణ చేసినట్లు,ఉదండ పూర్ రెవెన్యూ గ్రామం లో 1453.33 ఎకరాల కు గాను 1443.09 ఎకరాలు సేకరించినట్లు, 10.24 ఎకరాలు భూ సేకరణ చేయ వలసి ఉందని వివరించారు. వల్లూర్,ఉదండ పూర్,తుమ్మలకుంట తండా,రేగడి పట్టి తండా,చిన్న గుట్ట తండా,ఒంటి గుడిసె తండా, శామగడ్డ తండా ,పోలేపల్లి ఆవాస ప్రాంతాల్లో 1954 గృహాలు 60 ఎకరాల 26 గుంటలు సేకరణకు నోటిఫై చేసినట్లు తెలిపారు.667 గృహాలకు అవార్డ్ పాస్ చేసినట్లు,510 గృహాలకు టోకెన్ లు జనరేట్ చేసినట్లు,ఇంకా బ్యాలెన్స్ 161 గృహాలకు టోకెన్ లు జనరేట్ చేయ వలసి ఉందని తెలిపారు. ఆర్&ఆర్ కింద తుమ్మల కుంట తండా ,రేగడి పట్టి తండా,చిన్న గుట్ట తండా, శామగడ్డ తండా,ఒంటి గుడిసె తండా, తండా ,పోలేపల్లి నిర్వాసిత కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లించినట్లు తెలిపారు. జడ్చర్ల మండలం లోని వల్లూర్,ఉదండ పూర్,తుమ్మలకుంట తండా,రేగడి పట్టి తండా,చిన్న గుట్ట తండా,ఒంటి గుడిసె తండా, శామగడ్డ తండా,పోలేపల్లి గ్రామాల నిర్వాసితులకు జడ్చర్ల మండలం లోని పోలేపల్లిలో 125.13 ఎకరాలను,జడ్చర్ల లో 149.19 ఎకరాలు మొత్తం 274.32 ఎకరాలను పునరావాస కాలనీలుగా(ఆర్&ఆర్ సెంటర్) ప్రతి పాదించి నట్లు తెలిపారు. పనులు ప్రగతి లో ఉన్నవని తెలిపారు. ఆర్&ఆర్ లొకేషన్ 1,2 లలో మౌలిక వసతుల పనులు చేపట్టి నట్లు తెలిపారు. లొకేషన్ 1 లో లాండ్ లెవెలింగ్, సైడ్ డ్రైన్ లు,ప్లాట్ ల లెవెలింగ్,ప్లాట్ ల గుర్తింపు నంబరింగ్ తో స్టోన్ వేయటం,విద్యుత్ పనులు పూర్తి చేసినట్లు, అంతర్గత రహదారుల పనులు ప్రగతి లో నున్నట్లు తెలిపారు. లొకేషన్ 2 లో లాండ్ లెవెలింగ్, సైడ్ డ్రైన్ లు,ప్లాట్ ల లెవెలింగ్,ప్లాట్ ల గుర్తింపు నంబరింగ్ తో స్టోన్ వేయటం పనులు,విద్యుత్ పోల్ లు 50 శాతం పైగా పనులు పూర్తి చేసినట్లు తెలిపారు.వల్లూరు,ఉదండ పూర్ ఆర్&ఆర్ సెంటర్ లో .పి హెచ్.సి, అంగన్వాడీ,పాఠశాల భవనాలు ,గ్రామ పంచాయతీ భవనం, బస్ షెల్టర్,పంక్షన్ హాల్, కమ్యూనిటి భవనాలు పనులు, టెంపుల్ మొదలు పెట్టవలసి ఉందని అన్నారు. నిర్వాసితులను పునరావాస ఆర్ &ఆర్ సెంటర్ లో పనులు పూర్తి చేసి ప్లాట్ లు కేటాయించాలని అన్నారు.. నిర్వాసితుల కుటుంబాలకు పునరావాసం కు ఆర్&ఆర్ సెంటర్లలో పునరావాసం కేటాయింపుకు సరిపడా ప్లాట్ లు పోను మిగిలిన వారికి ko ఇంకా భూమి అవసరం ఉంటే రిక్విజిషన్ ఇచ్చి భూ సేకరణ ప్రక్రియ చేపట్టాలని అన్నారు. కోయిల్ సాగర్,మహాత్మా గాంధీ ఎత్తిపోతల పథకాల భూ సేకరణ పనులు సమీక్షించారు. రెగ్యులర్ గా అధికారులతో పనుల ప్రగతిపై సమీక్షించనున్నట్లు తెలిపారు.అప్డేట్ సమాచారం తో సిద్ధంగా ఉండాలని సూచించారు. సమావేశం లో రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, సాగు నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ బి.వి.రమణా రెడ్డి, గారు ఎస్. ఈ చక్రధరం,ఆర్.డి. ఓ నవీన్,సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏ. డి.కిషన్ రావు,మిషన్ భగీరథ ఇంట్రా ఈ ఈ పుల్లా రెడ్డి ,విద్యుత్ శాఖ అధికారరులు పాల్గొన్నారు.



## ప్రమాదవశాత్తు పడిన చెట్లను తొలగించిన కార్పొరేటర్ విజయకుమార్ గౌడ్

అంబర్ పేట, మే, 20(సమయం న్యూస్) : సోమవారం రాత్రి న్యూ పటేల్ నగర్ లో ప్రమాదవశాత్తు చెట్ల కొమ్మలు విరిగిపోయి విద్యుత్ వైర్లపై పడిపోవడంతో స్థానికులు అంబర్ పేట్ కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన కార్పొరేటర్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి సంబంధిత హార్టికల్చర్, మరియు విద్యుత్ సిబ్బందిని పిలిపించి చెట్ల కొమ్మలను తొలగింప చేయించడం జరిగింది, మరియు విద్యుత్ సిబ్బందితో తెగిపడిన వైర్లకు మరమ్మత్తులు చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు లవంగు ఆంజనేయులు, సద్దాం, సంతోష్ చారి, మరియు స్థానిక బస్తి నాయకులు గట్టయ్య, నరసింహ,ఉపేంద్ర చారి, రాజేందర్,తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ రేణుక ఎల్లమ్మ ఆట కళాకారులకు బండారి గంగాధర్ చేయుత

శివంపేట్ మే 20 (సమయం న్యూస్ ) : శివంపేట మండల్ పిల్లుట్ల గ్రామంలో శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ ఆట నిర్వహించడం జరిగింది భజన మండలి భక్తులకు ఆ యొక్క ఆటకు తన వంతు సహాయంగా బండారి గంగాధర్ బండారి క్రాంతి యొక్క చేతుల మీదుగా బి జి ఆర్ టీమ్ ఆధ్వర్యంలో 5011 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగింది. ఇలాంటి ఎల్లమ్మ ఆట నృత్యానికి సహాయం చేయడం ఆనందకరమైన విషయంగా భావించడం జరిగింది. సహాయాన్ని అందజేసినందుకు భజన మండలి తరఫున వారి కుటుంబానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో బిజిఆర్ అద్యక్షులు కుమ్మరి నాగరాజు గారు. పిల్లి కృష్ణ . పిల్లి నరసింహులు కొత్తపల్లి నాగరాజు పంతులు బాలేష్ రంగప్ప బాలరాజు గుల్లయ్య గారి కార్తీక్ పిల్లి హరీష్ బబ్బురి రాము. తదితరులు పెద్దలు పాల్గొన్నారు.

### గత యాసంగి కంటే
# ఈ సీజన్ లో 6.5 రెట్లు అధికంగా కొనుగోలు

* **జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి**
* **చివరి గింజ వరకు నాణ్యమైన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది**
* **సన్న రకం ధాన్యానికి రైతుల ఖాతాల్లో జమ కానున్న 42.88 కోట్ల బోనస్**
* **ధాన్యం కొనుగోలుపై పత్రికా ప్రకటన విడుదల చేసిన జిల్లా కలెక్టర్**

మహబూబ్ నగర్, మే 20:(సమయం న్యూస్) :గతం కంటే 6.5 రెట్లు వేగవంతంగా రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసినట్లు జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వేగవంతంగా వడ్ల కొనుగోలు జరుగుతుందని, రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు. జిల్లాలో యాసంగి మార్కెటింగ్ సీజన్ మే 20 నాటికి 202324లో 110 కొనుగోలు కేంద్రాల ద్వారా 19052 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, ప్రస్తుత సంవత్సరం 192 కొనుగోలు కేంద్రాల ద్వారా 23 వేల 410 మంది రైతుల నుంచి 289.75 కోట్ల విలువ గల లక్షా 24వేల 890 మెట్రిక్ టన్నులను కొనుగోలు చేసి 17 వేల 587 మంది రైతులకు 212 కోట్ల 60 లక్షల చెల్లింపులు పూర్తి చేశామని, మిగిలినవి కూడా 2 రోజులలో చెల్లింపులు జరుపుతామని అన్నారు. మే 20 నాటికి గతం కంటే 6.5 రెట్లు అధికంగా ధాన్యం కొనుగోలు చేయడమే కాకుండా కొనుగోలు చేసిన ధాన్యంలో రైతులకు వడ్ల డబ్బులు సకాలంలో చెల్లిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం సన్నరకం వడ్లకు 500 క్వింటాలుకు బోనస్ ప్రకటించడంతో పెద్ద ఎత్తున పంట సాగు జరిగిందని అన్నారు. పండించిన వడ్లను దళారులకు అమ్మకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయించి మద్దతు ధరతో పాటు బోనస్ కూడా చెల్లింపు తో లబ్ధి పొందుతూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో కొనుగోలు చేసిన లక్షా 24 వేల 890 మెట్రిక్ టన్నుల ధాన్యంలో సన్న రకం ధాన్యం 85 వేల 760 మెట్రిక్ టన్నుల ఉందని, వీటికి ఇప్పటి వరకు రైతులకు 42.88 కోట్ల రూపాయల బోనస్ ప్రభుత్వం త్వరలో చెల్లించడం జరుగుతుందని అన్నారు. భారత ఆహార సంస్థ నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకుని వస్తే వెంటనే కొనుగోలు చేస్తున్నామని, నాణ్యత ప్రమాణాలను పరీక్షించి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. జిల్లాలోనీ రైతులు ఎటువంటి ఇబ్బంది పడకుండా ఉండేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేశామని, కొనుగోలు కోసం 47.5 లక్షల గన్నీ బ్యాగ్స్ అవసరం ఉండగా ఇప్పటికే 39.50 లక్షల బస్తాలను కొనుగోలు కేంద్రాల వద్ద ఉంచమని, మిగిలిన బస్తాలను కూడా గోదాముల్లో సిద్ధంగా ఉంచామని అన్నారు. రాబోయే 15 రోజుల్లో మిగిలిన ధాన్యాన్ని సేకరించి మిల్లులకు తరలించే కార్యాచరణ ను రూపొందించామని, వర్షాల వలన ధాన్యం ఎక్కడ పాడవకుండా మార్కెటింగ్ శాఖ ద్వారా అవసరమైన టార్పాలిన్ కవర్లను పంపించామని అన్నారు. రాబోయే రోజుల్లో వడగండ్లతో కూడిన అకాల వర్షాలు పడే అవకాశం ఉందని తడవకుండా సురక్షితంగా నిల్వ చేసేందుకు కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలకు నిరంతరం స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నామని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.



### జహీరాబాద్ నియోజకవర్గంలో
# సీఎం పర్యటన చరిత్రాత్మకం కావాలి

* **సీఎం పర్యటనతో అభివృద్ధిలో జిల్లా రూపురేఖలు మారాలి**
* **ప్రభుత్వ శాఖల సమన్వయంతో సీఎం పర్యటన విజయవంతం చేయాలి --- రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ,సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ.**

సంగారెడ్డి మే 20(సమయం న్యూస్) : ఈనెల 23వ తారీఖున జహీరాబాద్ లో ముఖ్యమంత్రి పర్యటనపై కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా



అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ ఈ నెల 23వ తారీకున సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్ నియోజకవర్గం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన తెలంగాణ రాష్ట్రంలో చారిత్రాత్మకం కావాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పర్యటనతో సంగారెడ్డి జిల్లా అభివృద్ధిలో రూపురేఖలు మారుతాయన్నారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో సీఎం పర్యటన విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అధికారులు సీఎం పర్యటన కోసం రూట్ మ్యాప్ ప్రణాళిక, సెక్యూరిటీ ,బందోబస్తు, బారికేడ్లు , ట్రాఫిక్ నియంత్రణ, త్రాగునీరు, హెలిప్యాడ్ , హెల్త్ క్యాంప్ లు పకడ్బందీగా ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో బసవేశ్వర విగ్రహావిష్కరణ, కేంద్రీయ విద్యాలయ నూతన భవనం ప్రారంభోత్సవం, మహిళా పెట్రోల్ బంకు, జిల్లా అభివృద్ధికి కావలసిన కొన్ని కార్యక్రమాలను శంకుస్థాపనలు చేసి, వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాల పై ఏర్పాటు చేసిన స్టాల్ లను పరిశీలించి సభ లో పాల్గొంటారని తెలిపారు. జహీరాబాద్ ఎంపీ సురేష్ శేఖర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జిల్లాకు రావడం చాలా సంతోషమని జిల్లా అభివృద్ధిలో మరిన్ని అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభోత్సవం చేసుకుందామన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం జహీరాబాద్ నియోజకవర్గానికి ఎన్నో పరిశ్రమలను తీసుకువచ్చి ,ప్రజలందరికీ ఉపాధి కల్పించిందని గుర్తు చేశారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకొని ప్రజలకు ఇబ్బందులు లేకుండా ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు . జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాటు చేయాలని పక్కా ప్రణాళికతో సీఎం పర్యటన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి...

* **టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలి...**
* **మిల్లర్లు ధాన్యం దిగుమతిలో జాప్యం చెయ్యొద్దు ...**
* **జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



సూర్యాపేట మే20(సమయం న్యూస్) :ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం జిల్లా తేజస్ నంద్ లాల్ పవార్ నూతనకల్,తుంగతుర్తి, మద్దిరాల మండలం పోలుమళ్ళ, రామచంద్రపురం జాజిరెడ్డిగూడెం మండలంలోని అర్వపల్లి,తిమ్మాపురం 2,సూర్యాపేట మండలం ఎర్కారం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యంలో తాలు, గడ్డి లేకుండా తూర్పలా పోస్తేనే ధాన్యం నాణ్యతగా ఉంటాయని అన్నారు. అకాల వర్షాలకి వడ్లు తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని, ఎక్కువ మంది హమాలీలను ఏర్పాటు చేసుకొని కాంటా వేయగానే వెంటనే ధాన్యం లారీలకి లోడ్ చేయాలని తెలిపారు.లారీలను సర్దుబాటు చేస్తామని అలాగే మీకు అందుబాటులో ఉన్న లారీలను సర్దుబాటు చేసుకోవాలని సాధ్యమైనంత తొందరగా కేంద్రాలలో ఉన్న మొత్తం ధాన్యం కొనుగోలు చేసి కొనుగోలు కేంద్రాలను మూసివేయాలని సూచించారు.రైతులతో మాట్లాడుతూ రెండు మూడు రోజులలో అన్ని కొనుగోలు కేంద్రాలలో ధాన్యం పూర్తిగా కొనుగోలు చేస్తామని రైతులకి భరోసానిచ్చారు. ఆయా కేంద్రాలలో రికార్డులను పరిశీలించి ఎన్ని లోడ్లు తరలించారు ఇంకా ఎన్ని లోడ్లకి సరిపోను ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఉందని నిర్వాహకులని అడిగి తెలుసుకున్నారు. నూతనకల్ ఐకేపీ నుండి 8145 క్వింటాలు, మద్దిరాల నుండి 4500 క్వింటాలు, జాజి రెడిగూడెం మండలం అర్వపల్లి యన్ డి సీ యం నుండి 8000 క్వింటాలు , ఐకేపీ తిమ్మాపురం నుండి 8400 క్వింటాలు, తుంగతుర్తి ఉమెన్స్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ నుండి 6200 క్వింటాలు సూర్యాపేట మండలం ఎర్కారం పి ఏ సీ ఎస్ నుండి 21,400 క్వింటాలు ధాన్యం మిల్లులకి ఎగుమతి చేయటం జరిగిందని తెలిపారు. తదుపరి సూర్యాపేట మండలం బాలెంల లోని వజ్ర రైస్ ఇండస్ట్రీస్, పెన్ పహాడ్ మండలం మాచారం లోని వెంకటసాయి రైస్ ఇండస్ట్రీస్ ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిల్లర్లు ఎక్కువ మంది హమాలీలను ఏర్పాటు చేసుకొని ఎప్పటికప్పుడు జాప్యం చేయకుండా ధాన్యం దిగుమతి చేసుకోని లారీలను ధాన్యం కొనుగోలు కేంద్రాలకి పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై కార్పొరేషన్ డియం ప్రసాద్, తహసీల్దార్లు శ్రీనివాసరావు, అమీన్ సింగ్,రాం ప్రసాద్,లాల్ నాయక్, ఎంపిడిఓ సునీత, ఎ ఓ మురళి బాబు,ఏ పి యం రాంబాబు, ఏ ఈ ఓ సత్యం, ఇంచార్జిలు నాగార్జున, ముత్తయ్య,సురేష్,సంఘం సభ్యులు రైతులు తదితరులు పాల్గొన్నారు.




## ఆర్టిఐ కమిషనర్ గా నియమితులైన అయోధ్య రెడ్డి ని కలిసిన టి యు డబ్ల్యూ జే ప్రతినిధులు

కాప్రా, మే 20 (సమయం న్యూస్) రాష్ట్ర సమాచార హక్కు చట్టం ( RTI) కమీషనర్ గా నియమితులైన సీనియర్ జర్నలిస్టు బోరెడ్డి అయోధ్య రెడ్డిని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (TUWJ) మేడ్చల్ జిల్లా శాఖ జర్నలిస్టులు శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళవారం కాప్రా లోని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించారు. అయోధ్యరెడ్డిని కలిసిన వారిలో TUWJ రాష్ట్ర కోశాధికారి మోతే వెంకటరెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు గడ్డమీది బాలరాజు గౌడ్, దొంతుల వెంకట్రామిరెడ్డి మరియు సీనియర్ జర్నలిస్టులు భాస్కర్ రెడ్డి, బి. విజయ్ కుమార్, వేముల తిరుపతి రెడ్డి, వేముల శంకర్, కే నరోత్తంరెడ్డి, ఎం, సురేష్, అదిమూలం శ్రీనివాస్, రుద్రగోని నరసింహా గౌడ్, ఏవి శ్రీధర్ రావు, శేషారెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా నాయకులు మాట్లాడుతూ సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన అయోధ్య రెడ్డి జర్నలిస్టుగా రాణించడమే కాకుండా రాష్ట్ర సమాచార చట్టం కమిషనర్ గా నియమితులు కావడంపై హర్షం వ్యక్తం చేశారు.

# నైపుణ్య అభివృద్ధి శిక్షణతో ఉపాధి అవకాశాలు పెంపు

* **రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖా మాత్యులు డి.శ్రీధర్ బాబు**
* **త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా స్కిల్ సర్వే నిర్వహణ**
* **సింగరేణి స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ ను ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు**



పెద్దపల్లి, మే20 ( సమయం న్యూస్) : వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని రాష్ట్ర ఐ.టి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖా మాత్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. మంగళవారం రామగుండం 3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలోని ఎం.వి.టి.సి నందు సింగరేణి సంస్థ సి.ఎస్.ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ (నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం)ను రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ,జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష , రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాగూర్, స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ జె.అరుణశ్రీ, రామగుండం 3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర్ రావు లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, సింగరేణి సంస్థ నిరుద్యోగ యువతీ యువకులలో వృత్తి నైపుణ్యత పెంచి, ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం వివిధ ఏరియాలలో ఇలాంటి శిక్షణా కేంద్రాలు నిర్వహిస్తుందన్నారు. ఈ స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా సుమారు 38 కోర్సులలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వబడుతుందని, అలాంటి శిక్షణా కేంద్రాన్ని ఇక్కడ ఏర్పాటు చేయడం సంతోషకరమని అన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలు పొందాలని ఆకాంక్షించారు. శిక్షణ పొందే అభ్యర్థులు సర్టిఫికెట్ కోసమే కాకుండా, పూర్తిస్థాయిలో శిక్షణ పొంది నిజమైన నైపుణ్యాన్ని సాధించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిందని అన్నారు. రాష్ట్రంలో త్వరలో స్కిల్ సర్వే నిర్వహించి, నిరుద్యోగులకు వివిధ విభాగాలలో ఉన్నటువంటి నైపుణ్యత ఆధారంగా వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. సింగరేణి యాజమాన్యం ఈ నైపుణ్యాభివృద్ధి శిక్షణా కేంద్రాన్ని ఒక కళాశాలగా అభివృద్ధి చేసి, ఇక్కడి నుండే నియామకాలు చేపట్టే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్.డి.ఓ. సురేష్, హెచ్.ఆర్.డి. విభాగం జనరల్ మేనేజర్ గుంజపడుగు రఘుపతి, రామగుండం 1 ఏరియా జనరల్ మేనేజర్ డి.లలిత్ కుమార్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి కె.రాజ్ కుమార్, ప్రాతినిధ్య సంఘ నాయకులు కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.నరసింహులు, ఎస్వోటుజిఎం బి.వి. సత్యనారాయణ, వివిధ గనుల,విభాగాల అధిపతులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## మెప్మా రుణ అక్రమాలకు మరో 5 గ్రూపులు బలి

- **మహిళలను విచారించిన జిల్లా ఆడిట్ అధికారిని జయశ్రీ**
- **రుణంతో పాటు పొదుపు డబ్బులను డ్రా చేసిన ఆర్పీ**

గజ్వేల్, మే 20: గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మెప్మా రుణాల అక్రమాలలో మరో ఐదు మహిళా సంఘాలు బలైనట్లు విచారణ తేలింది. మెప్మా రుణాల అవకతవకలపై జరుగుతున్న విచారణలో భాగంగా మంగళవారం జిల్లా ఆడిట్ అధికారి జయశ్రీ మరో 5 మహిళా సంఘాల గ్రూపుల సభ్యులను విచారణ చేశారు. ఈ విచారణలో ఆయా గ్రూపుల సభ్యులు వెల్లడించిన విషయాలు మరింత దారుణంగా ఉన్నాయి. సభ్యుల పేరిట రెండు లక్షల చొప్పున రుణాలు ఇప్పించి ఆ సభ్యుల నుండి తిరిగి ఆర్పి కృష్ణలీల డబ్బులను డ్రా చేయించి తీసుకున్నట్టు వెల్లడైంది. ఈ క్రమంలో మహిళా సంఘాల సభ్యులు పొదుపు చేసుకున్న డబ్బులు కూడా డ్రా చేయడం గమనార్హం. రుణాలు పొందిన మహిళా సంఘాలలో సగం మంది వేరే గ్రూపుల సభ్యులు ఉండడంతో పాటు ఆర్ పి కుటుంబ సభ్యురాలు కూడా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. డ్రా చేసిన డబ్బులతో ఆర్ పి దాదాపు 90 తులాలకు పైగా బంగారం క్రయవిక్రయాలు చేసినట్టు తెలుస్తుంది. బ్యాంకులో ఆయా గ్రూపుల లావాదేవీలు పరిశీలిస్తే పూర్తి వివరాలు తెలుస్తాయని జిల్లా ఆడిట్ అధికారి జయశ్రీ తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు తెలిపిన ప్రకారం ఆర్ పి, మెప్మా సి ఓ లు సభ్యుల నుండి కొట్టేసిన డబ్బులలో వాటాలు పంచుకున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. బ్యాంకు లావాదేవీలు పరిశీలించిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసయ్య, ఆడిట్ సిబ్బంది,, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## డీ.ఈ.ఈ.టి ద్వారా వచ్చే అవకాశాలను

# యువత పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలి

* **జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.**
* **డీ.ఈ.ఈ.టి పని తీరు పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించిన జిల్లా కలెక్టర్**



పెద్దపల్లి, మే 20(సమయం న్యూస్) :డీ.ఈ.ఈ.టి (డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ ) ద్వారా వచ్చే అవకాశాలను యువత పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో డీ.ఈ.ఈ.టి పని తీరు పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు అందించే పరిశ్రమలు, వివిధ వాణిజ్య సంస్థలకు నిరుద్యోగులకు వారధిగా పనిచేసేందుకు ప్రభుత్వం డీ.ఈ.ఈ.టి (డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ ) ను ఏర్పాటు చేసిందని అన్నారు. మన పెద్దపల్లి జిల్లాలో డీ.ఈ.ఈ.టి ప్లాట్ ఫారం పై 1810 మంది యువత ఉపాధి అవకాశాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పొందేందుకు డీ.ఈ.ఈ.టి చాలా ఉపయోగపడుతుందని, జిల్లాలోని నిరుద్యోగ యువత ఇందులో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకుని అవకాశాలను వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో డీ.ఈ.ఈ.టీ పట్ల విస్తృత ప్రచారం కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. డీ.ఈ.ఈ.టి ప్లాట్ ఫారం ద్వారా యువతకు ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తాయని, వారి నైపుణ్యాల ఆధారంగా అర్హత గల ఉద్యోగాన్ని , నైపుణ్యాలను పెంచుకునేందుకు శిక్షణ సంస్థల సమాచారాన్ని , విద్యార్థులకు ఇంటర్న్ షిప్ అప్రెంటిషిప్ లకు సంబంధించిన సమాచారం అందుతుందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి కీర్తి కాంత్,డి. ఆర్. డి. ఓ. కాళిందిని, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## సర్వేనెంబర్ 27 నందు ఎలాంటి అక్రమ నిర్మాణాలు చేపట్టినా క్రిమినల్ కేసులు

* **మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ జయప్రకాష్ నారాయణ**

జిన్నారం, మే 20. సమయం న్యూస్ : సంగారెడ్డి జిల్లా గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని ఆల్లినగర్ గ్రామంలో, సర్వేనెంబర్ 27 నందు ఎలాంటి అక్రమ నిర్మాణాలు చేపట్టిన క్రిమినల్ కేసులు చేస్తామని మండల రెవెన్యూ ఇన్స్ పెక్టర్ జయప్రకాష్ నారాయణ తెలిపారు. మండల రెవెన్యూ అధికారి బిక్షపతి ఆదేశాల మేరకు మంగళవారం ఆయన అల్లి నగర్ గ్రామంలోని సర్వే నంబర్ 27 ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మండల రెవెన్యూ ఇన్స్ పెక్టర్ జైప్రకాష్ నారాయణ హెచ్చరించారు.

# సరస్వతి పుష్కరాలు భక్తులకు ఇబ్బంది కలగకూడదు

* **ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

కాళేశ్వరం మే20 (సమయం న్యూస్) : పరిశీలిస్తూ... అప్పటికపుడే వాకి టాకీ ద్వారా ఆదేశాలిస్తూ.... జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సరస్వతి పుష్కరాల లో భాగంగా 6వ రోజు కాళేశ్వరంలో ఏర్పాట్లును పరిశీలించారు.మంగళవారం కాళేశ్వరంలో పుష్కరాల సందర్భంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్టాండ్ ను పరిశీలించారు. భక్తుల రద్దీ బస్సుల ఏర్పాటు వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. తాత్కాలిక బస్టాండ్ నుండి పుష్కర ఘాట్ వరకు 40 షటిల్ బస్సులును ఉచితంగా నడుపుతున్నామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరాయంగా బస్సు సర్వీసులను కొనసాగించాలని ఆదేశించారు. బాలింత మహిళలు కోసం ఏర్పాటు చేసిన బ్రెస్ట్ ఫీడింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రయాణికులకు బస్సుల సమయ వివరాలను ఎప్పటికప్పుడు మైకు ద్వారా అనౌన్సు చేయాలని ఆదేశించారు. నంతరం ఆలయంలో భక్తుల రద్దీని పరిశీలించి భక్తులు క్యూ లైన్ లో ఎక్కువ సమయం వేచి చూడకుండా త్వరగా దర్శనం అయ్యేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. రెండు క్యూలైన్లలో భక్తులను దర్శనానికి అనుమతించాలని తద్వారా రద్దీ నియంత్రణ జరుగుతుందని తెలిపారు. అనంతరం సరస్వతి పుష్కర ఘాట్ ను పరిశీలించి అక్కడి నుండి హెలిప్యాడ్ జాయ్ రైడ్స్ వద్దకు చేరుకొని జాయ్ రైడ్స్ కు వచ్చే ప్రయాణికులను జాయ్ రైడ్ గురించి అడిగి తెలుసుకున్నారు. హెలిప్యాడ్ జాయ్ రైడ్స్ కు పెద్ద ఎత్తున ప్రచారం కల్పించాలని ప్రధాన కూడలిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అక్కడి నుండి సరస్వతి ఘాట్ చేరుకొని ఘాట్ వద్ద కొనసాగుతున్న పారిశుధ్య పనులు, మంచినీరు సరఫరా, బట్టలు మార్చుకొను గదులను పరిశీలించి సౌకర్యాలు కల్పనపై భక్తులను ఏర్పాటు చేసిన సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టి పరిశుభ్ర చేయాలని ఆదేశించారు. సింగరేణి రెస్క్యూ సిబ్బంది తో మాట్లాడి వారి సేవలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుండి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే తో కలిసి మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్షణ బోటు ద్వారా గోదావరిలో ప్రయాణం చేసి గోదావరి వరద ప్రవాహం భక్తులకోసం ఏర్పాటు చేసిన బారికేడింగ్, సంగమంలో గజ ఈత గాళ్ళు పహారాను పరిశీలించారు. సరస్వతి ఘాట్ నుండి గోదావరిలో త్రివేణి సంగమం, గోదావరి నది అవతలి ప్రాంతాలను ఏర్పాట్లును పరిశీలించారు.

సమయం
www.samayamdaily.net



# ధాన్యం కొనుగోళ్లు, రవాణా తదితర అంశాలపై రైతుల సౌకర్యార్థం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**టోల్ ఫ్రీ నెంబర్: 7995050789**



మహబూబాబాద్ మే 20( సమయం న్యూస్) : జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు, రవాణా, కేంద్రాల నిర్వహణ సంబంధిత అంశాలపై రైతుల సౌకర్యార్థం జిల్లా కలెక్టరేట్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి టోల్ ఫ్రీ నెంబర్ 7995050789 కేటాయించడం జరిగిందని, షిఫ్టుల వారిగా సిబ్బంది ఈ కంట్రోల్ రూమ్ లో ఉంటారని, రైతులకు, ఎలాంటి ఇబ్బందులు ఏర్పడిన ఈ నెంబర్ లో సంప్రదించాలని, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్, డిఎం సివిల్ సప్లై కృష్ణవేణి, లు తెలిపారు. జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోలు ప్రారంభం అయినా రోజు నుండే ఈ కంట్రోల్ రూమ్ పనిచేయడం జరుగుతుందని, సమస్య లు వచ్చిన వెంటనే స్పందించి సంబంధిత కేంద్రాల నిర్వహకులకు తగు ఆదేశాలు జారీ చేస్తూ ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# సింగిల్ యూసేజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

* **జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



నిర్మల్ మే20( సమయం న్యూస్) : జిల్లాలో సింగిల్ యూసేజ్ ప్లాస్టిక్ వినియోగంపై నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ప్లాస్టిక్ నిషేధంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణాన్ని ప్లాస్టిక్ తీవ్రంగా ప్రభావితం చేస్తోందని, ఇది మానవాళి ఆరోగ్యానికి మాత్రమే కాకుండా ఇతర జీవరాశులకు కూడా ముప్పుగా మారిందని కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని సూచించారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో స్టీల్ బ్యాంకులను ఏర్పాటు చేసి ప్లాస్టిక్ ఉపయోగాన్ని తగ్గించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, మహిళా స్వయం సహాయక సంఘాల సహకారంతో ఈ కార్యాచరణను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. పంచాయతీ స్థాయిలో ప్లాస్టిక్ నిషేధానికి అనుగుణంగా తీర్మానాలు చేయాలని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వస్తువులను వేరుగా సేకరించి సెగ్రిగేషన్ చేయాలని, కలెక్టరేట్ లో ఇప్పటికే స్టీల్ నీళ్ల సీసాలను వినియోగంలోకి తీసుకొచ్చామని వివరించారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల తయారీ, విక్రయంపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఉల్లంఘించిన వారికి జరిమానాలు, వ్యాపార లైసెన్సులను రద్దు చేయడం సహా చట్టపరమైన చర్యలకు వెనుకాడరాదని అధికారులను హెచ్చరించారు. ప్లాస్టిక్ నిషేధానికి కృషి చేస్తున్న సంస్థలను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళా సంఘాలు, యువజన సంఘాలు, ప్రజా ప్రతినిధులతో కలిసి గ్రామ సభలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం పెంచాలని అన్నారు. ప్లాస్టిక్కు ప్రత్యామ్నాయంగా జూట్, పేపర్ సంచుల తయారీ కేంద్రా లను మహిళా సంఘాలచే ఏర్పాటు చేయాలని సూచించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పరిశుద్ధ నిర్వహణను మెరుగుపరచాలని, దోమల నియంత్రణకు ఫాగింగ్ యంత్రాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, ఆర్డీఓలు రత్నాకళ్యాణి, కోమల్ రెడ్డి, జడ్పి సి ఈ ఓ గోవింద్, డి ఆర్ డి ఓ విజయలక్ష్మి, డి పి ఓ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు, జగదీశ్వర్ గౌడ్, రాజేష్ కుమార్, ఎంపీ డివో లు, తదితరులు పాల్గొన్నారు.

# బాలుడి అదృశ్యం



జిన్నారం, మే 20, సమయం న్యూస్ : సంగారెడ్డి జిల్లా బొల్లారం మున్సిపల్ ని పరిధిలోని చర్చి బస్తీలో సోమవారం రోజు గోపాల్ జైన్(14),7వ తరగతి విద్యార్థి మధ్యాహ్నం సుమారు 12:30 గంటలకు అదృశ్యం అయినట్లు బొల్లారం సర్కిల్ ఇన్స్పెక్టర్ రవీం దర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సురేంద్ర జైన్ ఒరిస్సా రాష్ట్రం నుండి వలస వచ్చి బొల్లారంలో భార్య, పిల్లలతో జీవనం సాగిస్తు ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూనాడు . గోపాల్ జైన్ ఈనెల 19వ తేదీ సుమారు మధ్యాహ్నం 12:30 గంటలకు షాప్ కు వెళ్లి వస్తానని ఇంటి నుండి బయలుదేరిన విద్యార్థి తిరిగి ఇంటికి రాలేదని చుట్టుప్రక్కల వెతికిన అతని ఆచూకీ తెలియలేదని బాలుడు తండ్రి సురేంద్ర జైన్ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పరిశోధన ప్రారంభిస్తునట్లు పోలీసులు తెలిపారు. బాలుడి ఆచూకి తెలిసిన వారు బొల్లారం పోలీస్ స్టేషన్ 8712656729,8712661841 నంబర్లకు సమాచారం ఇవ్వవలసిందిగా పోలీసులు తెలిపారు.

## మైనారిటీ స్కూల్ విభాగంలో రాష్ట్రస్థాయిలో ఉత్తమంగా నిలిచినందుకు

# క్రీసెంట్ హైస్కూల్ నీ వరించిన ఏఎంఈఐ అవార్డు




బోధన్ పట్టణం, మే 19, సమయం న్యూస్ : ఇటీవల హైదరాబాద్ లో కే.ఎల్.ఎన్.ప్రసాద్ ఆడిటోరియంలో అసోసియేషన్ ఆఫ్ మైనారిటీ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ (ఏ.ఎం.ఈ.ఐ) ఆధ్వర్యంలోరాష్ట్రస్థాయిలోపదవ తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలతో ప్రతిభ కనబరిచిన మైనారిటీ విద్యాసంస్థలకు, విద్యార్థులకు అభినందన సభలో ఏర్పాటు చేసి అవార్డులను, ప్రశంసా పత్రాలను అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి నాంపల్లి ఎమ్మెల్యే మొహమ్మద్ మాజీద్ హుస్సేన్ ముఖ్య అతిథిగా హాజరై, విజేతల్ని ప్రోత్సహించారు. బోధన్ పట్టణంలోని క్రీసెంట్ హైస్కూల్ కి చెందిన విద్యార్థి షేక్ అవేస్ అక్బర్ కూడా ఈ అవార్డును, ప్రశంసాపత్రాన్ని అందుకున్నవారిలో ఉన్నాడు. స్కూల్ కరస్పాండెంట్ జావేద్ అలీ తో పాటు షేక్ అవేస్కు ప్రత్యేకంగా సన్మానం జరిపారు. ఈ సందర్భంగా జావేద్ అలీ మాట్లాడుతూ, "విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల మద్దతు వలన క్రీసెంట్ హైస్కూల్ రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందింది. ఇది మా అందరికీ గర్వకారణం," అని తెలిపారు. రానున్న కాలంలో మరిన్ని విజయాలను సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రీసెంట్ హైస్కూల్ ఈ అవార్డుతో మరో మైలురాయిని చేరుకుంది. విద్యారంగంలో బోధన్ పట్టణానికి గర్వకారణంగా నిలిచిన ఈ ఘనతపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# బగలాముఖీ శక్తిపీఠంలో అమ్మవారికి మహాపూజలు



శివ్వంపేట మే 20 (సమయం న్యూస్) : దేశంలోనే ఎక్కడ లేని విదంగా ప్రపంచంలో ఎక్కడ లేని విదంగా మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రంలో దాతల సహకారంతో బగలాముఖీ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మితమై, ప్రతి నిత్యం భక్తులకు దర్శనమిస్తున్న శ్రీ బగలాముఖీ శక్తిపీఠంలో బగలాముఖీ అమ్మవారికి ప్రీతి పాత్రమైన మంగళవారం ఉదయం అమ్మవారికి మహాపూజలు నిర్వహించడం జరిగినది. అమ్మవారి ఉపాసకులు, బ్రహ్మర్శి శాస్త్రులు వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని పీతవర్ణ పుష్పాలు, పీతవర్ణ వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి, అమ్మవారికి రుద్రయామల బగలా అష్టోత్తర నామర్చనలతో హరిద్రార్చన కార్యక్రమం నిర్వహించి, అమ్మవారికి అభిషేకం, మంగళహారతి, మంత్రపుష్పం కార్యక్రమాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించి, నానా విధఫలాలతో నైవేద్యం సమర్పించడం జరిగినది. తనను నమ్మిన భక్తుల ప్రతిభందకాలను తొలగించే బగలాముఖీ అమ్మవారి దర్శనం చేసుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. అమ్మవారి భక్తులకు కొడకంచి సుదర్శన్ గౌడ్ పులిహోర ప్రసాదం అందజేయడం జరిగినది.





# సాలూరా లో వ్యవసాయ అధికారుల ఆకస్మిక తనిఖీ

* **ఫర్టిలైజర్ స్టాక్ & పి.ఓ.ఎస్ రిజిస్టర్ పరిశీలన**

బోధన్ నియోజకవర్గం, సాలూరా మండలం, మే 20, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా సాలూర మండలంలోని జాడిజమాల్పూర్ గ్రామంలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఎసిఎస్) నందు మంగళవారం రోజున ఆకస్మికంగా కీలక తనిఖీలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా సాలూర మండల తాసిల్దార్ శశిభూషణ్ మరియు వ్యవసాయ అధికారి (ఏవో) శ్వేత కలిసి గోదాంలో ఉన్న ఫర్టిలైజర్ స్టాక్ మరియు పాయింట్ ఆఫ్ సేల్ (పి.ఓ.ఎస్) స్టాక్ రిజిస్టర్ ను పరిశీలించారు. అధికారులు అందుబాటులో ఉన్న ఎరువుల నిల్వల వివరాలను, వాటి పంపిణీ ప్రక్రియను, అలాగే పి.ఓ.ఎస్ యంత్రాల సహాయంతో నిర్వహించే లావాదేవీలను సమీక్షించారు. సాలూర మండల వ్యవసాయ శాఖ పర్యవేక్షణలో వ్యవసాయ సంబంధిత సేవలు సమర్థవంతంగా అందిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. అలాగే రైతులకు సరైన సమయంలో సరైన నాణ్యత గల ఎరువులు అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి రామకృష్ణ, కరామత్ అలీ, ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలు పరిష్కరించినందుకు బట్టి విక్రమార్క కు ధన్యవాదాలు

* **తాజా మాజీ సర్పంచ్ల గౌరవ అధ్యక్షుడు దార సత్యనారాయణ**



దౌల్తాబాద్. మే 20.సమయం న్యూస్ : రైతుల సమస్యల లో వోల్టేజ్ పరిష్కారాన్ని తీర్చిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి బట్టి విక్రమార్క కు ధన్యవాదాలు తెలిపిన తాజా మాజీ సర్పంచుల గౌరవ అధ్యక్షుడు దార సత్యనారాయణ మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దౌల్తాబాద్ మండలం ముబారస్పూర్ 132/33 kv సబ్ స్టేషన్ లో 16.5 m mలో వోల్టేజ్ సమస్య ఉన్నందున రాష్ట్ర పిసిసి ఉపాధ్యక్షుడు పన్యాల శ్రావణ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో వారు వెంబడే స్పందించి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి బట్టి విక్రమార్కకు విన్నవించగా రైతుల సమస్యలను వెంబడే తీర్చాలని ఉద్దేశంతో 31.5 m m పి టి ఆర్ ను మంజూరు చేసినందుకు భట్టి విక్రమార్క కు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు సోమవారం ముబారక్పూర్ 132/33 k.v ట్రాన్స్ఫార్మర్ను ప్రారంభించుకున్నామని వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు కాంగ్రెస్ పార్టీ అంటేనే రైతుల కోసం కష్టపడి రైతులను రాజును చేసే విధంగా చూసుకుంటుందని తెలియజేశారు టీపీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్ కుమార్ రెడ్డి దృష్టికి గత సవత్సరం తీసుకోని పోవడం తో వెంటనే స్పందించి దౌల్తాబాద్, రాయపోల్ మండల రైతులు కు లో వోల్టేజి సమస్య ఉండకూడదనీ మా విన్నపం కు స్పందించి వెంటనే ఉప ముఖ్య మంత్రి దృష్టి కి తీసుకోవెళ్లగా నే శ్రవణ్ కుమార్ రెడ్డి విన్నపం కి స్పందించి 16 1 .5 m m బదులు 31.5 mva పి టి ఆర్ ను మంజూరు చేసినందున ఉప ముఖ్య మంత్రి కి మరియు జిల్లా ఇంచార్జి మంత్రి కి మరియు శ్రవణ్ కుమార్ రెడ్డి కి దౌల్తాబాద్, రాయపోల్ మండలాల రైతులు ప్రత్యేక ధన్యవాదములు తెలుపుతున్నామన్న

## ఎప్రిల్, మే నెల కేటాయింపుల ప్రకారం

# యూరియా సరఫరా చేయాల్సిందిగా కేంద్రమంత్రికి విజ్ఞప్తి

* **మంత్రి తుమ్మల**

హైదరాబాద్ మే20(సమయం న్యూస్) : ఎప్రిల్, మే నెలలకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించిన ఎరువులను పూర్తి మొత్తంలో సరఫరా చేయాల్సిందిగా కేంద్ర రసాయనాలు మరియు ఎరువుల మంత్రి శ్రీ జె.పి. నడ్డా గారికి గౌరవ వ్యవసాయశాఖ మాత్యులు శ్రీ తుమ్మల నాగేశ్వరరావు గారు లేఖ రాయడం జరిగింది. ఈ వానాకాలంకు 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించింది. దానిలో భాగంగా ఎప్రిల్ నెల మాసానికి 1.70 లక్షల మెట్రిక్ టన్నులు, మే మాసానికి 1.60 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయింపులు చేయగా, ఎప్రిల్ లో కేవలము 1.20 లక్షల మెట్రిక్ టన్నులు, మే నెలలో ఇప్పటి వరకు 0.52 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా కావడంతో, వ్యవసాయ శాఖ అదనపు సంచాలకుల ద్వారా గౌరవ వ్యవసాయశాఖ మంత్రి గారు, కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర అవసరాల దృష్ట్యా కేటాయింపులు జరిపిన విధంగా వెంటనే యూరియాను పంపించాల్సిందిగా లేఖ ద్వారా విజ్ఞప్తి చేయడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వము గత సంవత్సరము మాదిరిగానే ఈ సారి కూడా ఖరీఫ్ సీజన్ ఆరంభం నాటికి 4 లక్షల నుండి 5 లక్షల టన్నుల మేరకు యూరియాను ముందస్తుగా నిల్వచేసి, సీజన్ లో డిమాండ్ కు తగ్గట్లుగా సరఫరా చేయడం జరుగుతుందని, ఈ నిల్వలు, అప్పడు సరఫరా కాబడే యూరియాతో కల్సి రైతులకు అందచేయడం ద్వారా ఎక్కడా ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తకుండా చూస్తున్నామని తెలియచేశారు.

# ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు దిగజారి ప్రవర్తించొద్దు

* **విధుల పట్ల అంకితభావం, నిబద్ధతతో ప్రజల విశ్వాసం పొందాలి.**
* **అతిక్రమిస్తే తగిన చర్యలు తప్పవు.**
* **చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు ఆదేశాలు..**

ఇటీవల సమావేశాలు, సభల్లో చోటు చేసుకుంటున్నకొన్నిసంఘటనలు అవాంఛనీయమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అభిప్రాయపడ్డారు. బహిరంగ ప్రదేశాల్లో తగని విధంగా ప్రవర్తించటం సరికాదని ఈ మేరకు ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసింది. ఇటీవలి కాలంలో కొంతమంది అఖిల భారత సర్వీసు అధికారులు సామూహిక సమావేశాలు, సభల్లో సర్వీసు హోదాకు తగనటువంటి చర్యలు, హావభావాలు ప్రదర్శిస్తున్నట్లు ప్రభుత్వ దృష్టికి వచ్చింది. ఇలాంటి ప్రవర్తన ప్రజల్లో ఆ సర్వీసు అధికారుల మీద నమ్మకాన్ని కోల్పోయేలా చేస్తుంది. మరియు సేవ యొక్క మాన్యతను దెబ్బతీస్తుంది. అఖిల భారత సేవల ప్రవర్తనా నియమావళి, 1968 లోని నిబంధన 3(1) ప్రకారం: ప్రతీ సర్వీసులో సభ్యుడు ఎల్లప్పుడూ సంపూర్ణ నిజాయితీ, విధిపట్ల నిబద్ధత కలిగి ఉండాలి. సర్వీసులో ఉన్న అధికారికి తగని పనులు ఎట్టి పరిస్థితుల్లోనూ చేయకూడదు. అఖిల భారత సేవల అధికారులు, అధికారికంగా మరియు ప్రజలతో సంబంధాల విషయంలోనూ, అత్యున్నత స్థాయి నైపుణ్యం, నిజాయితీ, నిబద్ధతను పాటించాల్సిన బాధ్యత కలిగి ఉన్నారు. ఇది ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేందుకు అవసరమైన చర్య. కాబట్టి, ఇకపై ఏ అఖిల భారత సర్వీసు అధికారులు అయినా, సామూహిక సమావేశాలు, సభల్లో తగనటువంటి విధంగా ప్రవర్తించడం, హావభావాలు ప్రదర్శించడం వంటి చర్యల నుంచి నుంచి దూరంగా ఉండాలి.

# డార్క్ వెబ్‌లో ఆ విద్యార్థి కార్యకర్తకు అకౌంట్లు..

## మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్



భారత ప్రభుత్వం పాక్‌లోని ఉగ్రవాదులపై చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను, కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ.. సోషల్ మీడియాలో పోస్టులు చేసిన కేరళకు చెందిన విద్యార్థి కార్యకర్త రెజాజ్ ఎం షీబా సిద్ధిఖ్‌ను మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ ఇటీవల అదుపులోకి తీసుకుంది. దర్యాప్తులో భాగంగా అతడికి ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయని.. నిషిద్ధ డార్క్‌వెబ్ సైట్లలో (Dark web) పలు అకౌంట్లు ఉన్నాయని గుర్తించినట్లు అధికారులు పేర్కొన్నారు. అతడు డార్క్‌వెబ్‌లో చురుగ్గా ఉన్నాడని.. అందులో దేశవ్యతిరేక పోస్టులను అనుసరిస్తూ.. వాటికి మద్దతు పలుకుతున్నట్లు గుర్తించామని అన్నారు. రెజాజ్‌కు పాకిస్థాన్‌కు చెందిన పలు ఉగ్ర సంస్థలలో సభ్యత్వం కూడా ఉన్నట్లు తెలిపారు. మరిన్ని విషయాలు తెలుసుకోవడానికి అతడి వద్ద ఉన్న డిజిటల్ పరికరాలను సైబర్‌ఫోరెన్సిక్ ప్రయోగశాలకు పంపినట్లు తెలిపారు. సోషల్ మీడియాలో అతడు చేసిన పోస్టులలో నాగ్‌పుర్‌లోని ఒక రైఫిల్ దుకాణాన్ని సందర్శించి.. తుపాకీ పట్టుకొని తీసుకున్న ఫొటోలు ఉండడంతో అతడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని పేర్కొన్నారు. అతడికి ఇంకా ఎవరెవరితో సంబంధాలు ఉన్నాయనే విషయాలు తెలుసుకోవడానికి సోషల్ మీడియా అకౌంట్లను తనిఖీ చేస్తున్నామని అన్నారు.

**డార్క్‌వెబ్ అంటే?**

డార్క్ వెబ్‌లో కంటెంట్ మొత్తం ఎన్‌క్రిప్ట్ చేస్తారు. దాన్ని వాడాలంటే ప్రత్యేక బ్రౌజర్లు వినియోగించాలి. ద ఆనియన్ రింగ్ (టార్), ఫ్రీ నెట్, ఇన్‌విజబుల్ ఇంటర్నెట్ ప్రాజెక్ట్(I2P), ద అమీజక్ ఇన్‌కాగ్నిటో లైవ్ సిస్టమ్ (టైల్స్), వోనిక్స్ అందుకు ఉదాహరణలు. డార్క్ వెబ్‌ను తొలినాళ్లలో గోప్యత కోసం రూపొందించినా.. తర్వాత అక్రమార్కులు దాన్ని తమకు అడ్డాగా మలుచుకుంటున్నారు. మారణాయుధాలు, క్రెడిట్ కార్డుల డేటా, మాల్వేర్‌లు ఇలా రకరకాల రహస్య సమాచార విక్రయాలు అందులో జరిగిపోతున్నాయి. తమ సమాచారం ఎవరికీ తెలియకుండా ఉండడానికి అక్రమ వ్యాపారాలు చేసేవారు, ఉగ్రవాదులు దీనిని వినియోగిస్తారు. డార్క్ వెబ్ కార్యకలాపాలు ఎన్‌క్రిప్షన్‌తో ఉండడం వల్ల వాటిని తెలుసుకోవడం చాలా వరకూ కష్టం.




మంగళవారం దేవాలయం నుండి సరస్వతి ఘాట్ వరకు ఉచిత ఎలక్ట్రిక్ వాహనం ఏర్పాటు చేయాలని ఆదేశించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ. తక్షణమే ఎలక్ట్రిక్ వాహనం ఏర్పాటుతో భక్తులకు ఉచిత రవాణా సౌకర్యం ఏర్పాటు.




కాళేశ్వరంలో.జరుగుతున్న సరస్వతి పుష్కరాలలో బైక్ అంబులెన్స్ సర్వీస్ ద్వారా ఓ ఆర్ ఎస్ పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది



## ఉత్తరాఖండ్‌లో విరిగిపడిన కొండ చరియలు.. చిక్కుకుపోయిన వందలాది యాత్రికులు

ఉత్తరాఖండ్‌లో కొండచరియలు విరిగిపడ్డాయి. పితోరాగఢ్ జిల్లా సమీపంలో కైలాస్ మానస సరోవర్ యాత్ర మార్గంలో అవి విరిగిపడటంతో వందలాది యాత్రికులు చిక్కుకుపోయారు. వారితో పాటు స్థానికులు కూడా ఉన్నారు. ఆ మార్గాన్ని అందుబాటులోకి తెచ్చే విధంగా స్థానిక యంత్రాంగం సహాయకచర్యలు ప్రారంభించింది. శిథిలాలను తొలగించేందుకు బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ బృందం అక్కడకు చేరుకుంది. తాజా ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని అధికారులు వెల్లడించారు. పరిస్థితులు మెరుగుపడేవరకు యాత్రికులు అక్కడే ఉండాలని సూచించారు. ఐదేళ్లుగా నిలిచిపోయిన కైలాస్ మానస సరోవర్ యాత్రను ఈ ఏడాది జూన్ నుంచి తిరిగి ప్రారంభిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం గత నెల అధికారికంగా ప్రకటించింది. జూన్ నుంచి ఆగస్టు వరకూ కొనసాగనున్న ఈ యాత్ర ఉత్తరాఖండ్, సిక్కింలలో ప్రారంభం కానుందని విదేశీ వ్యవహారాలశాఖ తెలిపింది. '50' మంది యాత్రికుల చొప్పున 5 బృందాలు ఉత్తరాఖండ్‌లోని లిపులేఖ్ పాస్ నుంచి, 10 బృందాలు సిక్కిం నాథులా పాస్ నుంచి ఈ యాత్రకు తరలి వెళ్తాయి' అని వెల్లడించింది. యాత్ర కోసం దరఖాస్తులను kmy.gov.inలో సమర్పించవచ్చని, కంప్యూటర్ జనరేటెడ్ విధానం ఆధారంగా యాత్రికులను ఎంపిక చేస్తామని పేర్కొంది. కొవిడ్ కారణంగా కైలాస పర్వతం, మానస సరోవర్ సరస్సు యాత్ర 2020లో ఆగిపోయింది. ఆ తర్వాత గల్వాన్ ఘర్షణల కారణంగా భారత్, చైనాల మధ్య సంబంధాలు దెబ్బతినడంతో యాత్ర పునరుద్ధరణ చర్యలు ముందుకు సాగలేదు. గతేడాది రష్యాలో ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌ల భేటీ అనంతరం ఇరు దేశాల సంబంధాలను సాధారణ స్థితికి తెచ్చే చర్యలు మొదలయ్యాయి. ఈ క్రమంలోనే కైలాస్ మానస సరోవర్ యాత్రను తిరిగి ప్రారంభిస్తున్నారు. సాక్షాత్తూ పరమశివుడు నివాసముంటాడని విశ్వసించే చోటు కైలాస పర్వతం. బ్రహ్మ ముహూర్తంలో దేవతలు స్నానమాచరించే ప్రాంతంగా విశ్వసించే మానస సరోవరం సరస్సూ అక్కడికి చేరువలోనే ఉంటుంది. టిబెట్‌లోని ఈ రెండు సుమనోహర పుణ్యక్షేత్రాలు హిందువులతో పాటు జైనులు, బౌద్ధులకూ అత్యంత పవిత్రమైనవి. ఏటా ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు కైలాసమానస సరోవర యాత్రలో పాల్గొంటారు.

## అది కాళేశ్వరం కమిషన్ కాదు.. కాంగ్రెస్ కమిషన్



అది కాళేశ్వరం కమిషన్ కాదని.. కాంగ్రెస్ కమిషన్ అని ఎమ్మెల్సీ కవిత ధ్వజమెత్తారు. కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు ఇవ్వడాన్ని ఆమె 'ఎక్స్' వేదికగా స్పందించారు. ప్రజల కోసం ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాడిన ప్రజానాయకుడు కేసీఆర్ అని తెలిపారు. దురుద్దేశంతో, కుట్రపూరితంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రజా ప్రయోజనాల కోసం నిర్మించిన బృహత్ ప్రాజెక్టు అని తెలిపారు. తెలంగాణ ప్రజల తరతరాల దాహార్తిని తీర్చడానికి, తెలంగాణ పొలాల్లోకి గోదావరి నీళ్లను గలగలా తరలించడానికి కట్టిన ప్రాజెక్టు అని తెలిపారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా తీర్చిదిద్దడానికి కేసీఆర్ కట్టిన ప్రాజెక్టే కాళేశ్వరమని పేర్కొన్నారు. ఎన్ని కమిషన్లు ఏర్పాటు చేసినా తప్పకుండా న్యాయం గెలుస్తుందని.. నిజాలన్నీ బయటకు వస్తాయని తెలిపారు.




## షాదీ ముబారక్ చెక్కులను అందించిన అంబర్ పేట్ ఎమ్మెల్యే శ్రీ కాలేరు వెంకటేష్

అంబర్పేట, మే, 20 (సమయం న్యూస్) అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ హిమయత్ నగర్ మండల కార్యాలయంలో కాచిగూడ కార్పొరేటర్ ఉమ రమేష్ యాదవ్ తో కలసి 8 మంది లబ్ధిదారులకు షాదీ ముబారక్ చెక్కులు అందచేశారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదార్లు, వారి కుటుంబ సభ్యులు, తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## దోస్త్ గడువు రేపే లాస్ట్

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ 2025 ఫేజ్ 1 రిజిస్ట్రేషన్ రేపటితో ముగియనుంది. మే 3న ప్రారంభమైన దోస్త్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ, మే 21న ముగియనుందని ఉన్నత విద్యా మండలి ప్రకటించింది. తెలంగాణలోని ఆరు విశ్వవిద్యాలయాల్లో (ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ, పాలమూరు, మహాత్మా గాంధీ, సతవాహన) డిగ్రీ కోర్సులైన BA, B.Com, B.Sc, BBA, BCA, BSW, DPharmacy మొదలైన వాటిలో ప్రవేశాల కోసం ఈ ప్రక్రియ నిర్వహించబడుతుంది. దీని ద్వారా సుమారు 4 లక్షల సీట్లు భర్తీ చేయబడనుండగా.. ఇప్పటి వరకు 64 వేల మంది రిజిష్ట్రేషన్ చేసుకున్నారు. రిజిష్ట్రేషన్ చేసుకున్న వారికి ఈనెల 10న ప్రారంభం అయిన వెబ్ ఆప్షన్స్ ప్రక్రియ కూడా మే 22న ముగియనుంది. అయితే రిజిష్ట్రేషన్ చేసుకున్న వారిలో సగం మంది మాత్రమే వెబ్ ఆప్షన్స్ ఎంచుకున్నట్టు సమాచారం. మే 29న సీట్ల కేటాయింపు జరగనుండగా.. రిజిస్ట్రేషన్, వెబ్ ఆప్షన్స్ గడువు తేదీ పెంచాలని విద్యార్థుల నుంచి భారీగా వినతులు వస్తున్నట్టు సమాచారం.

## పెంచిన జీతాలు తగ్గించే సంప్రదాయానికి కాంగ్రెస్ తెరలేపింది

మినీ అంగన్వాడీ కార్యకర్తలను పూర్తిస్థాయి అంగన్వాడీలుగా గుర్తించి, వారికి పెంచిన వేతనాలను తక్షణం చెల్లించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని, బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన జీవోను కాపీ కొట్టి ప్రచారం చేసుకోవడం మినహా వారికి చేసిందేమీ లేదని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 3,989 మంది మినీ అంగన్వాడీ కార్యకర్తల సేవలను గుర్తించి, వారిని అంగన్వాడీలుగా అప్‌గ్రేడ్ చేస్తూ 2023 సెప్టెంబర్‌లో జీవో ఇచ్చిందని, అయితే ఎన్నికల కోడ్ కారణంగా



అది అమలు కాలేదని హరీశ్ రావు గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక, మంత్రి సీతక్క ఇదే అంశంపై తొలి సంతకం చేశారని, డిసెంబర్ 15న జీవో కూడా ఇచ్చారని, కానీ అది పాత జీవోకు నకలేనని ఆరోపించారు. ప్రభుత్వం జనవరి 2024 నుంచి మూడు నెలల పాటు రూ. 13,650 చొప్పున పెరిగిన వేతనం అందించి, ఆ తర్వాత మళ్లీ వారి జీతాన్ని రూ. 7,800కు తగ్గించి పాత పద్ధతిలోనే చెల్లిస్తున్నారని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది అత్యంత దారుణమని, పెంచిన జీతాలు తగ్గించే సంప్రదాయానికి కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపిందని ఎద్దేవా చేశారు. మే నెలకు సంబంధించి కేవలం 8 జిల్లాల్లోనే పెరిగిన జీతాలు చెల్లించి, మిగతా జిల్లాల వారిని విస్మరించడం అన్యాయమన్నారు. జనవరి 2024 నుంచి పెండింగ్‌లో ఉన్న పూర్తి జీతాలను మినీ అంగన్వాడీలందరికీ వెంటనే చెల్లించాలని, అంగన్వాడీ కేంద్రాలుగా మారిన చోట హెల్పర్లను నియమించాలని, మే నెల జీతాలు అందని జిల్లాల్లో కూడా తక్షణమే పంపిణీ చేయాలని హరీశ్ రావు తన లేఖలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తున్న మహిళల కడుపు కొట్టడం సరికాదని హితవు పలికారు.

## ప్రతీకార దాడుల వేళ.. గోల్డెన్ టెంపుల్‌లో 'ఆయుధాలకు' అనుమతి

అమృత్‌సర్ స్వర్ణ దేవాలయాన్ని పాకిస్థాన్ లక్ష్యంగా చేసుకుందని అయితే, భారత్ సైన్యం దానిని సమర్థంగా తిప్పికొట్టిందని ఆర్మీ ఉన్నతాధికారులు ఇటీవల వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై వైమానిక దళ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ సుమర్ ఇవాన్ మాట్లాడుతూ.. దేశంలో అంతర్గత కలహాలు సృష్టించడానికి పాక్ ఇక్కడి ఆలయాలపై దాడులు చేస్తుందని తాము ఊహించామని అన్నారు. అనుకున్నట్లుగానే పంజాబ్‌లోని స్వర్ణ దేవాలయంపై దాడులకు కుట్ర పన్నుతున్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయని అన్నారు. అమృత్‌సర్‌లోని పవిత్ర స్వర్ణ దేవాలయానికి ముప్పు పొంచి ఉందని తాము



సమాచారం ఇవ్వగానే అక్కడి పెద్దలు తమకు పూర్తిగా సహకారం అందించారని పేర్కొన్నారు. ఆయుధాలు తీసుకెళ్లడానికి ఆ ఆలయ ప్రధాన గ్రంథి (గురుద్వార్ పర్యవేక్షకుడు) సైనికులకు ప్రత్యేక అనుమతిని ఇచ్చారని గుర్తు చేసుకున్నారు. "దేవాలయంలోని ప్రధాన ప్రదేశాల్లో సైనికులు తుపాకులతో మోహరించడానికి మాకు అనుమతి ఇచ్చారు. అంతే కాకుండా ప్రయోగిస్తున్న క్షిపణులను గుర్తించడానికి వీలుగా స్వర్ణ దేవాలయంలోని లైట్లను ఆపివేయించారు. బహుశా ఎన్నో ఏళ్లుగా వెలుగుతున్న ఆ లైట్లు ఆపివేయడం ఇదే మొదటిసారి కావచ్చు. అందుకు వారికి కృతజ్ఞతలు" అని లెఫ్టినెంట్ జనరల్ పేర్కొన్నారు. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత పాకిస్థాన్ అక్కసుతో స్వర్ణ దేవాలయాన్ని లక్ష్యంగా చేసుకుందని మేజర్ జనరల్ కార్తిక్ సి శేషాద్రి వెల్లడించారు. మన ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ గన్నర్స్.. పాకిస్థాన్ సైన్యం ప్రణాళికలను తిప్పికొట్టారని తెలిపారు. మన స్వర్ణ దేవాలయంపై ఒక్క గీత కూడా పడకుండా అన్ని డ్రోన్లు, క్షిపణులను కూల్చివేశారని మేజర్ జనరల్ వెల్లడించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో వందలాది పాక్ డ్రోన్స్, మిసైల్స్‌ను పాక్ ప్రయోగించిందని.. మన ఎస్400, ఆకాశ్ తదితర గగనతల రక్షణవ్యవస్థలు అద్భుతరీతిలో వాటిని నేలమట్టం చేశాయని తెలిపారు.

# సినిమా

# వాణీ కపూర్ 2 సినిమాలు



'శుద్‌దేశ రొమాన్స్' మూవీతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ముద్దుగుమ్మ వాణీ కపూర్. హిందీలో అడుగుపెట్టిన కొత్తలోనే ఎనలేని గుర్తింపు తెచ్చుకుంది. వరుస ఆఫర్స్‌తో ఫుల్‌ఫేమస్ అయ్యింది ఈ చిన్నది. నాని సరసన ఆహా కల్యాణం చిత్రంతో తెలుగులోకి అడుగుపెట్టింది. టాలీవుడ్ డెబ్యూ సినిమా ఫ్లాపైనా, బాలీవుడ్ లో హృతిక్ సరసన 'వార్' లాంటి బ్లాక్ బస్టర్ లోనూ మెప్పించింది. ప్రస్తుతం వాణీ బాడ్తమీజ్ గిల్, సర్వగుణ సంపన్న అనే రెండు క్రేజీ చిత్రాల్లో నటిస్తోంది. మరోవైపు ఈ అందాల భామ ఇంతకుముందు పాక్ నటుడు ఫవాద్ తో కలిసి చేసిన 'అబిర్ గులాల్' రిలీజ్‌కు బ్రేకులు పడ్డాయి. ఓవైపు వాణిజ్య ప్రకటనలు, మరోవైపు సినిమాలతో బిజీ బిజీగా ఉన్నా కూడా సోషల్ మీడియాల్లోనూ ఎప్పుడూ ఫ్యాన్స్‌తో టచ్ లోనే ఉంటుంది. తాజాగా ఈ భామ లేటెస్ట్ బోల్డ్ ఫొటోషూట్లు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. ఈ బ్యూటీ చీటా ఫ్రాక్ మిరుమిట్లు కుర్రకారును ఒక రేంజులో హీటెక్కిస్తోంది. థై స్లిట్ ఎలివేషన్ తో గుబులు రేపుతోంది.



# ఔను వాళ్లిద్దరూ ఒక్కటవుతున్నారు

హీరో విశాల్, నటి సాయి ధన్సిక త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కబోతున్నారు. కొన్నేళ్లుగా వీళ్ల పెళ్లిపై జరుగుతున్న ప్రచారానికి తెరదించుతూ అఫీషియల్ అనౌన్స్ మెంట్ ఇచ్చేశారు. తమ రిలేషన్‌ను అనౌన్స్ చేయడంతో పాటూ పెళ్లి డేట్ ను కూడా వెల్లడించింది ఈ జంట. యోగిడా మూవీ ఈవెంట్ లో విశాల్, ధన్సిక ఈ విషయాన్ని బయటపెట్టారు. సాయి ధన్సిక చాలా మంచి వ్యక్తి. మేమిద్దరం కలిసి ఓ అద్భుతమైన లైఫ్ ను స్టార్ట్ చేయబోతున్నాం. పెళ్లి తర్వాత కూడా ధన్సిక యాక్టింగ్ కెరీర్ ను కంటిన్యూ చేస్తుందని విశాల్ చెప్పగా అదే విషయాన్ని సాయి ధన్సిక కూడా కన్ఫర్మ్ చేసింది. విశాల్ పెళ్లి గురించి ఇప్పటికే పలుసార్లు వార్తలు రాగా, నడిగర్ సంఘం భవనం పూర్తైన తర్వాతే తాను పెళ్లి చేసుకుంటానని చెప్పిన సంగతి తెలిసిందే. రీసెంట్ గా ఆ భవనం పూర్తైన సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ త్వరలోనే పెళ్లి చేసుకుంటానంటూ విశాల్ క్లారిటీ ఇచ్చాడు.

# గెట్ రెడీ ఫర్ ద వార్



ఫ్యాన్స్ఎంతగానో ఎదురుచూస్తున్న మ్యాన్ ఆఫ్ మాసెస్, యంగ్‌టైగర్ ఎన్టీఆర్ బర్త్‌డే ట్రీట్ వచ్చేసింది. హృతిక్ రోషన్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న 'వార్ 2' నుంచి టీజర్ రిలీజైంది. యాక్షన్ సన్నివేశాలతో కూడిన గ్లింప్స్ ఆకట్టుకుంటోంది. ఇందులో ఎన్టీఆర్ పవర్‌ఫుల్‌గా కనిపించాడు. 'నా గురించి తెలియదేమో.. ఇప్పుడు తెలుసుకుంటావ్.. 'గెట్ రెడీ ఫర్ ద వార్' అంటూ యంగ్‌టైగర్ చెప్పిన డైలాగ్ టీజర్‌కే హైలెట్‌గా నిలిచింది. ప్రధానంగా తారక్‌ను ఫోకస్ చేస్తూ ఈ వీడియో ఉండటంతో ఆయన ఫ్యాన్స్ వైరల్ చేస్తున్నారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రానికి యడ్రాజ్ ఫిల్మ్స్ నిర్మాతగా వ్యవహరిస్తోంది. కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రీతమ్ మ్యూజిక్ అందిస్తున్నాడు. ఈమూవీ ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.



# కీరవాణిని సన్మానించిన పవన్ కల్యాణ్

నటుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. ఆస్కార్ గ్రహీత, సంగీత దర్శకుడు కీరవాణి స్టూడియోను సందర్శించి, ఆయన్ను సన్మానించారు.



# 'రానా నాయుడు 2'.. స్ట్రీమింగ్ డేట్ ఫిక్స్



వెంకటేశ్, రానా కలిసి నటించిన వెబ్‌సిరీస్ 'రానా నాయుడు'. 2023లో వచ్చిన సీజన్ 1 యూత్‌కు బాగా నచ్చినా, చాలా చోట్ల శ్రుతిమించిన శృంగార సన్నివేశాలు, అసభ్య పదజాలం ఉందన్న అభిప్రాయమూ వ్యక్తమైంది. అమెరికన్ టీవీ సిరీస్ 'రే డొనోవన్'కు రీమేక్‌గా ఈ ప్రాజెక్టు రూపొందింది. తొలి సీజన్‌ను కొనసాగిస్తూ ఇప్పుడు 'రానా నాయుడు: సీజన్ 2' రూపొందిన సంగతి తెలిసిందే. తాజాగా విడుదల తేదీ ఖరారైంది. ఓటీటీ 'నెట్‌ఫ్లిక్స్'లో జూన్ 13 నుంచి స్ట్రీమింగ్ కానుంది. సీజన్ 1కు వచ్చిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నట్టు వెంకటేశ్ గతంలో తెలిపారు. దాన్ని దృష్టిలో పెట్టుకుని సీజన్ 2లో బోల్డ్ కంటెంట్ తగ్గించినట్టు తెలిపారు. సీజన్ 1 కంటే సీజన్ 2కు మరింత ప్రేక్షకాదరణ దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఫామ్‌లోలేని రిషభ్‌పంత్‌కు టీమ్‌ఇండియా మాజీ ఆటగాడి మద్దతు

ఫామ్‌లో లేని రిషభ్‌పంత్‌కు ఈ ఐపీఎల్ సీజన్ నిజంగా ఓ పీడకలే. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ రూ.27 కోట్లు వెచ్చించి పంత్‌ను వేలంలో దక్కించుకుంది. జట్టు కెప్టెన్సీ బాధ్యతలు కూడా అప్పజెప్పింది. కానీ, ఇప్పటి వరకు తాను ఆడిన 12 మ్యాచుల్లో కేవలం 135 పరుగులు మాత్రమే చేసి అభిమానుల్ని నిరుత్సాహ పరుస్తున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో రిషభ్ పంత్‌కు టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా మద్దతుగా నిలుస్తున్నాడు. 'విజయాలు కొన్ని విషయాలు నేర్పిస్తాయి. కానీ, పరాజయాలు ఆలోచన ధోరణినే మారుస్తాయి. టీమ్ఇండియా టీ20 జట్టులో రిషభ్‌పంత్ రెగ్యులర్ ఆటగాడు కాదు. ఇలాంటి స్థితిలో ఈ సీజన్ అతనికి చాలా కీలకమైంది. కానీ చక్కటి



ఇన్నింగ్స్‌లు ఆడి తనను తాను నిరూపించుకునే అవకాశం చేజార్చుకుంటున్నాడు. పంత్‌కు ఏదీ కలసి రావడం లేదు. అతడి ఫామ్‌లో స్థిరత్వం లోపించింది. నిజంగా ఇది పంత్‌కు పీడకలే. మంచి విషయం ఏంటంటే.. మేల్కొంటే ఆ పీడకల పోతుంది' అని ఆకాశ్ చోప్రా అన్నాడు. లఖ్‌నవూ టీమ్‌లో పంత్ పాత్ర గురించి కూడా ఆకాశ్ చోప్రా మాట్లాడాడు. 'లఖ్‌నవూ సూపర్ కింగ్స్‌కు రిషభ్‌పంత్ మిడిలార్డర్‌లో కీలకమైన ఆటగాడు. కానీ సరైన ఇన్నింగ్స్‌లు ఆడలేకపోతున్నాడు. సీజన్ ప్రారంభంలో పంత్ దూకుడుగా కనిపించాడు. కానీ ఆ తర్వాత వెనుకబడిపోయాడు. ఇది అతడు ఫామ్‌లో లేడు అనడానికి సంకేతం. రిషభ్ పంత్ కచ్చితంగా మేల్కొంటాడు. తిరిగి ఫామ్‌లోకి వస్తాడు' అని ఆశాభావం వ్యక్తం చేశాడు. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు లీగ్ దశలో మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. మే 22న గుజరాత్ టైటాన్స్‌తో, మే 27న రాయల్‌ఛాలెంజర్స్ బెంగళూరుతో తలపడనుంది. వీటిలోనైనా పంత్ తిరిగి బ్యాటింగ్‌లో తన లయను అందుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# ఐపీఎల్ 2025: ప్లే ఆఫ్స్ మ్యాచ్‌ల వేదికలు ఖరారు.. ఫైనల్ ఎక్కడంటే?

ఐపీఎల్ (IPL) 2025 ప్లే ఆఫ్స్ వేదికలను బీసీసీఐ ఖరారు చేసింది. ముల్లాన్‌పుర్, అహ్మదాబాద్‌లో నాలుగు ప్లే ఆఫ్స్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. మే 29న జరిగే క్వాలిఫయర్ 1, మే 30న జరగనున్న ఎలిమినేటర్ మ్యాచ్‌లకు ముల్లాన్‌పుర్ ఆతిథ్యమిస్తుంది. క్వాలిఫయర్ 2 (జూన్ 1), ఫైనల్ (జూన్ 3) అహ్మదాబాద్‌లో జరుగుతాయి. ఈ మేరకు బీసీసీఐ ప్రకటన విడుదల చేసింది. గుజరాత్ టైటాన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ ఇప్పటికే ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించాయి. మిగిలిన ఒక్క బెర్తు కోసం ముంబయి ఇండియన్స్, దిల్లీ క్యాపిటల్స్




పోటీపడుతున్నాయి.

**ఆర్సీబీ మ్యాచ్ లఖ్‌నవూలో**

మే 23న బెంగళూరు వేదికగా ఆర్సీబీ, సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్ జరగాల్సి ఉంది. మ్యాచ్‌కు వర్షం ముప్పు ఉంది. దీంతో ఈ మ్యాచ్‌ను లఖ్‌నవూకు తరలించారు. హైదరాబాద్‌తో మ్యాచ్ తర్వాత ఆర్సీబీ మే 27న లఖ్‌నవూ వేదికగానే ఎల్ఎస్‌జీతో తలపడనుంది. ఈ నేపథ్యంలో సన్‌రైజర్స్‌తో మ్యాచ్‌ను కూడా అక్కడికి తరలించారు.

Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131.